# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 185

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: ఆదివారం 02 ఆగష్టు 2026








పశ్చిమ బెంగాల్ పోలీసు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఉగ్ర కుట్రను భగ్నం చేసింది. ఇటీవలే అరెస్టయిన జైషే మహమ్మద్ అనుమానిత ఉగ్రవాది మహమ్మద్ హమీమ్ మోండల్ స్నేహితురాలు అర్పిత సర్కార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి జార్ఖండ్‌లోని సాహెబ్‌గంజ్‌లో ఎస్టీఎఫ్ అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్‌కు తరలించారు.

**సమయం ప్రతినిధి:** అనుమానిత ఉగ్రవాది హమీమ్ మోండల్‌ను గురువారం బర్ధమాన్ పట్టణంలోని ఒక పెద్ద ఇంట్లో ఎస్టీఎఫ్ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ (ISI) మద్దతుతో పనిచేస్తున్న ఒక పెద్ద ఉగ్ర నెట్‌వర్క్‌లో హమీమ్ కీలక పాత్ర పోషిస్తున్నాడని అధికారులు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లోని బీజేపీ నాయకులతో పాటు పలువురు ముఖ్యమైన వీఐపీల సమాచారాన్ని సేకరించడం వారి టార్గెట్. దీని కోసం కొత్త వారిని రిక్రూట్‌మెంట్‌లో చేర్చుకోవడం, రాష్ట్రంలో ఉగ్ర కార్యకలాపాలకు ప్రణాళికలు రచించేందుకు సిద్ధమయ్యారు. దర్యాప్తులో భాగంగా హమీమ్, అర్పితల మధ్య క్రమం తరచూ జరిగిన వాట్సాప్ సంభాషణల (WhatsApp Chats) వివరాలను అధికారులు సేకరించారు. పశ్చిమ బెంగాల్‌లోని కీలకమైన రాజకీయ నాయకులతో సంబంధాలు ఏర్పరచుకోవడానికి, వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడానికి హమీమ్ ఈమెను ఒక సాధనంగా వాడుకున్నట్లు ఎస్టీఎఫ్ గుర్తించింది. అరెస్టు అనంతరం ఇద్దరినీ విచారిస్తున్న పోలీసులు, ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న మరికొందరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.




ఇథనాల్ బ్లెండింగ్ విధానాన్ని కేంద్రం మరోసారి సమర్థించుకుంది. ముడి చమురు బ్యారెల్ ధర 135 డాలర్లకు చేరిన రోజుల్లో ఇథనాల్ బ్లెండింగ్ లేకపోయి ఉంటే న్యూఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.125కు చేరేదని పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

**సమయం ప్రతినిధి:** ఇథనాల్ బ్లెండింగ్ కారణంగా అప్పట్లో ప్రజలు లీటరుకు రూ.94.77 మాత్రమే చెల్లించారని తెలిపింది. లీటర్ పెట్రోల్‌లో 20 శాతం వరకూ ఇథనాల్ కలపడంతో పెరిగిన ముడి చమురు ధరల భారం నుంచి ప్రజలకు రక్షణ లభించిందని పేర్కొంది. ధరలు పతాకస్థాయిలో ఉన్నప్పుడు లీటరుకు రూ.30 వరకూ ప్రజలకు ఆదా అయ్యిందని తెలిపింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలైన తరువాత దాదాపు 75 రోజుల పాటు ఇంధన ధరలు స్థిరంగానే ఉన్నాయని కేంద్రం పేర్కొంది. మే నెలలో లీటరుకు రూ.7.5 చొప్పున పెంచాల్సి వచ్చిందని పేర్కొంది. ప్రస్తుతం ఈ20 పెట్రోల్ (91–ఆక్టేన్) ధర ఢిల్లీలో రూ.102.12గా ఉందని, 100–ఆక్టేన్ పెట్రోల్ ధర రూ.169గా ఉందని పేర్కొంది. పేదల కోసం ఉద్దేశించిన ధాన్యాన్ని ఇథనాల్ ఉత్పత్తికి మళ్లిస్తున్నారన్న ఆరోణలను కూడా కేంద్రం తోసిపుచ్చింది. ఇథనాల్ బ్లెండింగ్ విధానాన్ని శాస్త్రీయమైన పద్ధతిలో దశలవారీగా ప్రవేశపెట్టామని కూడా పెట్రోలియం శాఖ చెప్పింది. ఉత్పత్తి సామర్థ్యం, మౌలిక వసతులకు అనుగుణంగా ఈ విధానాన్ని అంచలంచెలుగా ప్రవేశపెట్టామని పేర్కొంది. ఈ10 ఇంధనానికి అనువుగా రూపొందించిన బీఎస్–3, బీఎస్–4, బీఎస్–6 వాహనాల్లో ఈ20 పెట్రోల్ వాడినప్పుడు మైలేజీ వాహన కేటగిరీని బట్టి 2–6 శాతం మేర తగ్గొచ్చని తెలిపింది.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తా కథనం సంబంధిత స్క్రీన్ షాట్‌ను ఎక్స్‌లో షేర్ చేశారాయన. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

**పెట్టుబడులు, ఉపాధితో వేగంగా అభివృద్ధి..**

విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.




**పెద్దపల్లి, సమయం ప్రతినిధి:** బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మాణ లోపాల వల్లే సమస్యలు తలెత్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. పెద్దపల్లిలో జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు, ఎల్లంపల్లి ప్రాజెక్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్ఆర్ఎస్పి, కడెం, ఎల్లంపల్లి వంటి ప్రధాన ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిగా దృఢంగా ఉందని, అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో నిర్మాణ లోపాల కారణంగ సమస్యలు తలెత్తాయని విమర్శించారు. ఎల్లంపల్లి పంపులను ఆన్ చేసి మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోశామని బీఆర్ఎస్ ప్రచారం చేసుకుందని, కానీ వాస్తవ పరిస్థితులు అందరికీ తెలుసని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ నివేదికల ఆధారంగానే ప్రస్తుతం బ్యారేజీల్లో నీటి నిల్వలను పరిమితం చేస్తున్నాం. కన్నెపల్లి పంపులను వెంటనే ఆన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉంది. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టుల ఫౌండేషన్ సక్రమంగా లేదు. ఐఐటీ బాంబే, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు వచ్చే వర్షాకాలం వరకు నీటి నిల్వలను నియంత్రిస్తాం. భద్రతా సూచనలను విస్మరించి నీటిని నిల్వ చేస్తే డ్యాం దిగువన ఉన్న గ్రామాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితుల్లో బాధ్యత ఎవరు వహిస్తారు' అని అన్నారు.

## జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా నర్సింహులు బాధ్యతల స్వీకరణ



**మహబూబ్‌నగర్, ఆగస్టు 1 (సమయం ప్రతినిధి):** మహబూబ్‌నగర్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సి.పి.ఓ)గా బి. నర్సింహులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గణాంక శాఖ డైరెక్టర్, హైదరాబాద్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయనకు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కె. రవీందర్ జూలై 31న పదవీ విరమణ చేయడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, ప్రస్తుతం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో గణాంక అధికారిగా విధులు నిర్వహిస్తున్న బి. నర్సింహులను సి.పి.ఓగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి నర్సింహులు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రణాళిక, గణాంక విభాగాల పనితీరును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నూతన సి.పి.ఓగా బాధ్యతలు చేపట్టిన నర్సింహులకు జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, గణాంక శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలియజేస్తూ, వారి పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## కేజీబీవీ బాలానగర్‌లో నివారణాత్మక ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి



**మహబూబ్‌నగర్, ఆగస్టు 1 (సమయం ప్రతినిధి):** మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ కేజీబీవీ పాఠశాలలో శనివారం నిర్వహించిన నివారణాత్మక పాఠశాల ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఐ. విజయకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎత్తు, బరువు, శరీర ద్రవ్యరాశి సూచీ (బాడీ మాస్ ఇండెక్స్), రక్తపోటు, రక్తంలో ఆక్సిజన్ స్థాయి, శరీర ఉష్ణోగ్రత తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అలాగే సాధారణ ఆరోగ్య స్థితి, పోషకాహార పరిస్థితి, చెవి, కంటి, ఎదుగుదల సంబంధిత పరీక్షలతో పాటు దంత పరీక్ష, వినికిడి పరీక్ష, దృష్టి పరీక్ష, మానసిక ఆరోగ్యం, నాడీ సంబంధిత అభివృద్ధి మూల్యాంకనాలను కూడా వైద్య బృందం చేపట్టింది. కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో ఇటువంటి నివారణాత్మక ఆరోగ్య పరీక్షలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడగా, విద్యార్థులు ఆరోగ్య పరీక్షలతో పాటు వైద్య బృందం అందించిన ఆరోగ్య అవగాహన ద్వారా కూడా ప్రయోజనం పొందినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.




**(సమయం ప్రతినిధి):** విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రీల్‌లో మాత్రమే క్షమిస్తారా? లేక విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉపసంహరించుకుంటారా?' అంటూ ఆయన సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో, కొందరు ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై ప్రధాని స్పందిస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేశారు. తనను, తన తల్లిని దూషించిన వారిని తాను క్షమిస్తున్నానని, వారిని శిక్షించడం కంటే సరైన మార్గంలో నడిపించడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ వీడియోపై స్పందించిన అభిజీత్ దిప్కే, 'క్షమించామని చెప్పడం సరిపోదు. విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఎత్తివేస్తారా?" అని ప్రశ్నించారు.

## మహబూబ్‌నగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్‌గా దార్ల కాళిదాస్ బాధ్యతల స్వీకరణ



**మహబూబ్‌నగర్, ఆగస్టు 1 (సమయం ప్రతినిధి):** మహబూబ్‌నగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్‌గా, జిల్లా సబ్‌జైళ్ల అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దార్ల కాళిదాస్ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. 1999 బ్యాచ్‌కు చెందిన జైళ్ల శాఖ అధికారి అయిన దార్ల కాళిదాస్ బదిలీపై మహబూబ్‌నగర్ జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా జైళ్లలో క్రమశిక్షణ, భద్రత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఖైదీల సంక్షేమం, పునరావాస కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. జైళ్లలో సానుకూల వాతావరణాన్ని నెలకొల్పడంతో పాటు ఖైదీలకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, సామాజిక పునరావాసానికి అవసరమైన కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. దార్ల కాళిదాస్ గతంలో చంచల్‌గూడ కేంద్ర కారాగారం, చర్లపల్లి కేంద్ర కారాగారం, ఓపెన్ జైలు తదితర జైళ్లలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి విశేష పరిపాలనా అనుభవాన్ని సంపాదించారు. కాగా, మహబూబ్‌నగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసిన శశికాంత్ చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి బదిలీ కావడంతో, ఆయన స్థానంలో దార్ల కాళిదాస్ నియమితులై బాధ్యతలు స్వీకరించారు.

# సంపాదకీయం

## ‘సర్’లో సర్వమూ నిరంకుశత్వమే

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు తెలంగాణలో మొదలైన ‘సర్’ (ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ) కార్యక్రమం ప్రజల్లో తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తోంది. ఓటర్ కార్డు ఉంది కాబట్టి మా ఓటుకు ఏ ఢోకా లేదని చదువుకున్న మధ్యతరగతి వాళ్ళు, ప్రతిసారీ జరిగినట్లే ఇప్పుడు కూడా ఓటర్ నమోదు జరిగిపోతుందని శ్రామికవర్గ ప్రజలు, అసలిందంతా ముస్లిం ఓటర్లను తీసెయ్యటానికి కాబట్టి మనకేం కాదని ముస్లిమేతరులు భావిస్తున్నారు. ఇప్పటికే బిహార్, బెంగాల్‌లో జరుగుతున్న పరిణామాలను గమనించిన ప్రజలు, ముఖ్యంగా ముస్లిం మైనారిటీలు భయాందోళనలో ఉన్నారు. గత సంవత్సరం ఎన్నికల సంఘం- దేశం మొత్తం మీద ఈ ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ చేపడతామని, 2002లో ఇటువంటి ప్రత్యేక సవరణ జాబితా విడుదల చేశామనీ, దాని తర్వాత ఇప్పుడు చేస్తున్నామనీ ప్రకటించింది. వెనక్కి తొంగి చూస్తే, అప్పటి జాబితా తయారీకి ప్రచార ప్రయత్నం 1999లో ప్రారంభమైందని, 2003లో జాబితాను ప్రచురించారని తెలుస్తుంది. దీనివల్ల ఓటర్లు ఇబ్బందులు పడిన సమాచారం కానీ, అంతకు ముందు ఓటర్ల జాబితాతో లింకు చేసుకోవాలని, లేక తమ తల్లిదండ్రుల పేర్లతో లింకు చేసుకోవాలని, లేని వాళ్ళు సాక్ష్యాధారాలు ఇవ్వాలనే షరతులు కూడా మనకు అప్పటి వార్తల్లో కనిపించవు. జరుగుతున్న ప్రత్యేక ‘సమగ్ర’ ఓటర్ల జాబితాలోని షరతులు, రెండు దశాబ్దాల ముందటి జాబితాతో తప్పనిసరిగా లింకు చేసుకోవాలనే నియమం, ఓటర్ల గుర్తింపు పత్రాల సమర్పణ మొదలైనవి మనకి ‘ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950’లో కానీ, ‘ఓటర్ల నమోదు నియమాలు 1960’లో గానీ దొరకవు. ఇవన్నీ ‘అవస రానికి తగ్గట్లు ప్రమాణాలని పెట్టొచ్చు’ అని చట్టంలో ఉన్న నియమాన్ని ఎన్నికల సంఘం విస్తృతంగా, నిరంకుశంగా విస్తరించి తయారుచేసిన ఫలితం. విదేశీ చొరబాటుదారులు ఓటర్ గుర్తింపు కార్డులు తెచ్చుకుని తమ ఓట్ల ద్వారా రాజకీయాలని శాసిస్తున్నారనే ప్రచారోద్యమం భారతీయ జనతా పార్టీ విపరీతంగా చేస్తూ వస్తోంది. 2018లో అస్సాంకున్న సంక్లిష్ట వలసల చరిత్ర నేపథ్యంలో, ఎప్పటి నుంచో ఒప్పుకున్న డిమాండ్‌ని అనుసరించి రాష్ట్ర పౌరుల జాబితా తయారు చేస్తే, ముస్లింల కన్నా హిందువులు ఎక్కువగా తొలగింపబడ్డారు. దాంతో అసలు ఇక్కడ కాదు, దేశమంతా చొరబడ్డారు అంటూ జాతీయ పౌరుల జాబితా తయారు చేస్తామని 2019లో ప్రకటించారు. పౌరసత్వ చట్టాల్లో మతపరమైన ప్రమాణాలని ప్రవేశపెడితే అంతర్జాతీయ నిరసనతో పాటు దేశవ్యాప్త ప్రతిఘటన రావటంతో కొంత కాలం వెనక్కి తగ్గారు. కానీ, ఈవీఎంలతో పాటు, ఓటర్ల జాబితాను ఎంత తారుమారు చేసినా 2024 ఎన్నికల్లో ఎదురుదెబ్బ తినటంతో, 2025లో ఈ ఆయుధాన్ని కొత్త రూపంలో ప్రచారంలోకి తెచ్చారు. ఓటర్ల జాబితా నుంచి విదేశీ ఓటర్లని ఏరివేస్తామంటూ పౌరసత్వంతో దీన్ని జత చేశారు. ఒకప్పుడు అస్సాంకి మాత్రమే పరిమితమైన ఈ పౌరసత్వ పరీక్షని ఇప్పుడు అందరికీ వర్తింపజేస్తున్నారు. భారత పౌరసత్వ చట్టం బ్రిటిష్ ఇండియా విభజన నేపథ్యంలో ఏర్పడటంతో మొదటి నుంచీ కొన్ని షరతులు ఉంటూ వచ్చాయి. అస్సాం ఒప్పందం తర్వాత, 1986లో తెచ్చిన పౌరసత్వ చట్ట సవరణలో... భారత పౌరులు కావాలంటే పుట్టుకతో పాటు, కనీసం తల్లి గానీ, తండ్రి గానీ పౌరులు అయ్యుండాలనే నిబంధన, ఆ తర్వాత 2003లో తల్లిదండ్రులు ఇద్దరూ కూడా పౌరులు అవటమే గాక, అక్రమ వలసదారులు అయ్యుండకూడదని, అటువంటి వారిని ‘విదేశీయులుగా’ పరిగణించి ‘నిర్బంధ శిబిరాలకు’ తరలించాలనే నిబంధన తెచ్చారు. ఈ సవరణలని కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీల వాళ్ళు సమర్థించారు. పౌరులు కాని వాళ్ళు ఓటర్ల జాబితాలో ఉండకూడదు అనే నియమం తప్ప, ఈ పౌరసత్వ చట్టాలకు, పౌరసత్వ నిర్ధారణ ప్రక్రియకు, ఓటర్ల జాబితాతో, దాని సవరణతో ఏ చట్టపరమైన సంబంధం లేదు. అయితే, ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణలో ఈ ‘వంశ పారంపర్యత’ నిరూపణకు కేంద్ర స్థానం ఇచ్చారు. ప్రతి ఓటర్‌ని, 2002 జాబితాతో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ తమ సంబంధాన్ని నిరూపించుకోవాల్సిందిగా కొత్త నియమం తెచ్చారు. అంటే, తాము గానీ, తమ తల్లిదండ్రులు, అమ్మమ్మ, తాతలు 2002 ఓటర్ల జాబితాలో ఉన్నారని చూపెట్టాలి. దీన్నే మాపింగ్ అంటారు. మనం, మన చుట్టాలు 2002 జాబితాలో లేకపోతే మనకి ఎన్నికల సంఘం నుంచి ముసాయిదా జాబితా తయారీ తర్వాత నోటీసు వస్తుంది. అప్పుడు మన స్థానిక ఎన్నికల ఆఫీసర్ దగ్గరికెళ్లి మనం ఇక్కడే పుట్టామనీ, చదివామనీ, లేదా ప్రభుత్వం మనని గుర్తించిందని సరిపడే సాక్ష్యాలని ఎన్నికల సంఘం చెప్పిన 11 పత్రాలు, ఇతర సాక్ష్యాల ద్వారా చూపెట్టి మన అర్హతని నిరూపించుకోవాలి. అలా చెయ్యలేకపోతే, మనం పూర్తి ‘అనుమానా స్పదులు’గా మారతాం. అందరికీ ఉండే రేషన్ కార్డు, వివిధ రకాల సంక్షేమ కార్డులని, ఎవరైనా డబ్బులిచ్చి సంపాదిస్తారన్న నెపం మీద ఈ 11 పత్రాలలో వాటిని చేర్చలేదు. ఈ పత్రాల్లో అస్సాం పౌరసత్వ జాబితా, ఫారెస్టు రైట్స్ పత్రం, 10వ క్లాస్ సర్టిఫికెట్ అతి తక్కువమందికి ఉంటే.. పర్మినెంట్ రెసిడెంట్ సర్టిఫికెట్, ఫ్యామిలీ రిజిస్టర్ ఎవరికీ ఉండవు. అసలు ఈ ఫ్యామిలీ రిజిస్టర్ ఏమిటో ఇప్పటికీ చాలామంది అధికారులకే తెలియదు. రాజస్థాన్‌లో ఉన్నాయని వినికిడి. స్కూలు డ్రాప్‌ఔట్స్‌కి మిగిలిన ఆరింటిలో కుల ధ్రువీకరణ పత్రం కూడా ఉండదు. వీటన్నింటితో పాటు బెంగాల్ ఎన్నికల తర్వాత లాజికల్ డిస్క్రిపెన్సి పేరుతో కొత్త ‘తొలగింపు ప్రమాణాలు’ తెచ్చారు. మన పేరు, వివరాలు, ఓటర్ జాబితాలోనూ, అధికారిక పత్రాల్లోనూ ఏ తప్పులు లేకుండా సరిగ్గా సరిపోవాలి. తల్లులకు, పిల్లలకు మధ్య వయసులో తేడా 15ఏళ్ల కంటే తక్కువ ఉండకూడదు. అన్ని కార్డులు, జాబితాల్లో తండ్రి పేరు సరిగ్గా ఒకలాగే ఉండాలి. ఇవి కాకుండా ఎన్నికల ముందు కూడా కొత్తవి తేవచ్చు. అతి తక్కువ సమయంలో, శిక్షణ లేని వ్యక్తుల ద్వారా, తీవ్ర ఒత్తిడి కింద పని చేయించటంతో ఈ ప్రక్రియ అన్ని స్థాయిల్లో అనేక తప్పుల తడకలతో నడుస్తోందని సాక్ష్యాధారాలతో సహా ఉన్నత న్యాయస్థానికి వెళ్లగా... పర్లేదు, తప్పులు దిద్దుకుంటారులే అంటూ, సర్దుకుపొమ్మని చెప్పింది. ఈ గతాన్ని తవ్వి తీసే నియమాలన్నీ ఓటు హక్కుని ఉల్లంఘించే విధంగా ఉన్నాయని అభ్యర్థిస్తే.. అర్హులు కాని వాళ్ళని తొలగించటానికి ఈ మాత్రం చెయ్యాలన్నది. లాజికల్ డిస్క్రిపెన్సి చాలా అన్యాయమని అంటే, నెమ్మదిగా ట్రిబ్యునల్స్ సమస్యలని పరిష్కరిస్తాయి, అప్పటి వరకూ మీరు ఓట్లు వెయ్యకండి, తర్వాత వేసుకోండి అని కోర్టు చెప్పింది. తానే పదేళ్లు సాగదీసి అందరినీ తీసుకునేలా చేసిన ఆధార్ కార్డుని షరతులతో 12వ గుర్తింపుపరంగా చేర్చటానికి ఆమోదించింది. రూపంలోనే ఇంత సంకుచితంగా, నిరంకుశంగా ఉన్న ఈ సవరణ అమలులో ఎట్లా జరిగిందో చూద్దాం. ఈ ప్రక్రియలో అణగారిన, వలస వచ్చిన, సంచార జాతుల ప్రజలు, అన్ని వర్గాల అణగారిన ప్రజల్లో ముఖ్యంగా స్త్రీలు అందరూ కలిపి దాదాపు ఆరు కోట్ల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. బెంగాల్‌లో కొన్ని జిల్లాల ఓటర్ల తొలగింపులో 65శాతానికి పైగా ముస్లిం స్త్రీలు ఉన్నారు. గత రెండు ఎన్నికల నుంచి ఉత్సాహంతో ఓటు వేస్తున్న స్త్రీల శాతం ఈ ‘సర్’లో పడిపోయింది. దానికి కారణం–పెళ్లి తర్వాత అత్తగారింటికి వలసలు, ఇంట్లోంచి గెంటివేయటం, ఇతర వలసలు, కుటుంబ హింస, చదువు లేకపోవటం వంటి కారణాలతో ధ్రువీకరణ పత్రాలు సరైన సమయంలో ఇవ్వలేకపోవటం. బిహార్‌లో ప్రయోగాత్మకంగా 2025 జూన్‌లో మొదలైనప్పుడు ఏవయితే సమస్యలని అనేకమంది క్రింది స్థాయి కార్యకర్తలు ఎత్తి చూపించారో, వాటిని సరిదిద్దుకోవటం బదులు, బెంగాల్‌కి వచ్చేసరికి కొత్త ప్రమాణాలని రంగంలోకి తీసుకొచ్చి ఇంకా సంక్లిష్టంగా తయారు చేశారు. ఓటర్ల మీద బాధ్యత నెట్టెయ్యటం, ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రమాణాలను కావాల్సినట్లు మార్చుకునే నిరంకుశాధికారాన్ని పెట్టుకోవటం, దొడ్డిదారిన పౌరసత్వ నియమాలతో దీనికి ముడివెయ్యటం, అంతేగాక, ప్రజలను పెద్ద ఎత్తున జాబితా నుంచి తొలగించే ఉద్దేశాలతోనే కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘం ద్వారా ఈ ‘సర్’ అనే దుర్మార్గాన్ని తెచ్చింది.

## ఆపరేషన్ ముస్కాన్-12 విజయవంతం.. 80 మంది చిన్నారుల రక్షణ

మహబూబ్‌నగర్, ఆగస్టు 1 (సమయం ప్రతినిధి): మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-12 విజయవంతంగా పూర్తయిందని జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ తెలిపారు. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, భిక్షాటన, విద్యకు దూరమైన చిన్నారులను గుర్తించి రక్షించడం, వారికి సురక్షితమైన భవిష్యత్తు కల్పించడం లక్ష్యంగా జిల్లా పోలీసులు సంబంధిత ప్రభుత్వ శాఖలు, చైల్డ్‌లైన్, ఇతర విభాగాలతో కలిసి విస్తృతంగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. జూలై 1 నుంచి 31 వరకు నోడల్ అధికారి అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం పర్యవేక్షణలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో జిల్లాలో మొత్తం 80 మంది చిన్నారులను రక్షించినట్లు ఎస్పీ తెలిపారు. వీరిలో 76 మంది బాలురు, 4 మంది బాలికలు ఉండగా, ఇతర రాష్ట్రాలకు చెందిన 18 మంది చిన్నారులను కూడా గుర్తించి రక్షించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 79 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రక్షించిన చిన్నారులను సంబంధిత అధికారుల సమక్షంలో వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు అప్పగించినట్లు చెప్పారు. జిల్లాలో బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, చిన్నారుల అక్రమ రవాణా, భిక్షాటన, పిల్లలను విద్యకు దూరం చేసే చర్యలపై పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ప్రతి చిన్నారి హక్కులను పరిరక్షించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, బాల కార్మికులు లేదా ప్రమాదంలో ఉన్న చిన్నారులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, అత్యవసర సేవలు, చిన్నారుల సహాయ వ్యవస్థలను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో కూడా ఆపరేషన్ ముస్కాన్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రతి చిన్నారి సురక్షితమైన, విద్యతో కూడిన భవిష్యత్తు పొందేలా అన్ని శాఖలతో సమన్వయంగా చర్యలు కొనసాగిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. ఆపరేషన్ ముస్కాన్–12ను విజయవంతంగా నిర్వహించడంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య ఆధ్వర్యంలోని డివిజనల్ బృందం, ఎస్ఐ లెనిన్, ఏఎస్ఐ విలియం మార్క్, పీసీలు శ్రీహరి, శివకుమార్, మహిళా పోలీస్ కానిస్టేబుల్ శిల్ప, చైల్డ్‌లైన్ ప్రతినిధులు అంజాద్, ఆర్‌డీఎస్ విజయభారతి, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. చిన్నారుల రక్షణ, సంక్షేమం కోసం ఇదే సేవాస్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.




## సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి...

## పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు...

పెబ్బేరు ఆగస్టు01 (సమయం ప్రతినిధి) : సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేసిన పెబ్బేరు మండలం రంగాపురం గ్రామ సర్పంచ్ కుమారుడు చంద్రాస్ రెడ్డి అనే వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ ను కలిసి పోలీస్ స్టేషన్ లో లిఖిత పూర్వకంగా శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు చేసిన సర్పంచ్ కుమారుడు చంద్రాస్ రెడ్డి అనే వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు యుగంధర్ రెడ్డి సురేందర్ గౌడ్,రామన్ గౌడ్,వెంకటేష్ సాగర్,బూరమోని రాములు యాదవ్,జైపాల్ రెడ్డి,కావలి బాలస్వామి,రణధీర్ రెడ్డి,ఉప సర్పంచ్ పెద్దింటి నందీశ్వర్,సింగిల్ విండో డైరెక్టర్ పెద్దింటి చంద్రయ్య,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్, మాజీ డైరెక్టర్ రాముడు,ఎస్సీ సెల్ మండల నాయకులు దారపోగు వెంకటేష్,బెరికి లక్ష్మయ్య,దాది రాముడు, మాల సతీష్,దేవర్ల బీసుపల్లి,మండ్ల నరేష్,శివ,శ్రీకాంత్,సంజీవ్,రాజశేఖర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




## 13 వేల మందితో థింసా నృత్యం నన్ను కదిలించింది: ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతూ 13 వేల మంది గిరిజన విద్యార్థినిలు, మహిళలు థింసా నృత్యం చేశారు. థింసా నృత్యంపై ప్రధాని మోదీ శనివారం మధ్యాహ్నం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ‘13 వేల మంది చేసిన థింసా నృత్యం నన్ను కదిలించింది. ఈ అపూర్వ స్వాగతం ఏపీ ప్రజల ఆత్మీయతకు ప్రతీక. సాంస్కృతిక వారసత్వాన్ని థింసా ప్రతిబింబించింది. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవాన్ని.. థింసా నృత్యం చిరస్మరణీయంగా మార్చింది’ అని రాసుకొచ్చారు. ప్రధాని మోదీ మరో పోస్టులో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం గురించి స్పందిస్తూ.. ‘నా మిత్రుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో.. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో ఉత్సాహంతో ముందుకు సాగుతోంది. సెమికండక్టర్లు, ఐటీ, ఇన్నోవేషన్స్ వంటి రంగాలలో రాష్ట్రం అద్భుతమైన కృషి చేస్తోంది. ఇది రాష్ట్రంలోని యువతకు ప్రత్యేక ప్రయోజనాలను చేకూరుస్తుంది’ అని రాసుకొచ్చారు. ఏపీ అభివృద్ధిపై స్పందిస్తూ.. ‘కేంద్రంలో.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి కోసం ఎంతో వేగంగా పని చేస్తోంది. మేము బ్లూ ఎకానమీ, నౌకాశ్రయాల అభివృద్ధి, పారిశ్రామిక వృద్ధి, ఇతర రంగాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాము’ అని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు పేరుపై స్పందిస్తూ.. ‘భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా.. నా ఆంధ్రప్రదేశ్ సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక అభినందనలు. మహానుభావుల స్ఫూర్తిదాయకమైన సేవలను గుర్తించి, వారిని గౌరవించాలనే మా సంకల్పానికి అనుగుణంగా ఈ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టారు’ అని పేర్కొన్నారు.

## విజన్ ఎడ్యుకేషన్ అడుగులు

హైదరాబాద్ : తెలంగాణ విద్యావ్యవస్థలో నూతన అధ్యాయాన్ని లిఖించబోతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థపై తన విజన్ ను ఆవిష్కరించారు. విద్యారంగ సమగ్ర స్వరూపాన్ని మార్చేందుకు తన వద్ద ఉన్న కార్యాచరణను స్పష్టంగా వివరించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు అతీతంగా, రాబోయే తరాల భవిష్యత్తే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన నొక్కి చెప్పారు. గత పాలకులు ఇరిగేషన్ శాఖను తమ వద్ద ఉంచుకుని, వేల పుస్తకాలు చదివామని గొప్పలు చెప్పుకుంటూ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందన్నారు రేవంత్ రెడ్డి. కానీ నేను మాత్రం ఓట్లు లేని, కేవలం బాధ్యత మాత్రమే ఉన్న విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని పరోక్షంగా విపక్షాలకు కౌంటర్ ఇచ్చారు. తానెలాంటి తప్పులు చేయలేదని, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు వివాదాల్లేకుండా పూర్తి చేశానని గుర్తుచేశారు. గడిచిన నాలుగేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, తెలంగాణ విద్యా వ్యవస్థ 28వ స్థానం నుండి 18వ స్థానానికి చేరుకుందని గణాంకాలతో సహా వెల్లడించారు. ప్రైవేట్ పాఠశాలల్లో తల్లిదండ్రులు రూ. 50 వేలకు మించి ఖర్చు చేయడం లేదని, కానీ ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై రూ. 1.08 లక్షలు వెచ్చిస్తోందని సీఎం స్పష్టం చేశారు. బడ్జెట్‌లో విద్యకు 9 శాతం నిధులు కేటాయిస్తున్నప్పటికీ, నాణ్యతా ప్రమాణాల్లో ప్రపంచంతో పోటీ పడటంలో మనం ఎక్కడో వెనుకబడి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ పూర్తయినా కనీసం ఉద్యోగానికి దరఖాస్తు కూడా రాయలేని పరిస్థితి మారి తీరాలని ఉద్ఘాటించారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చడమే కాకుండా, విదేశీ పర్యటనలకు ప్రతి ఏటా ఉపాధ్యాయులను పంపి గ్లోబల్ ఎడ్యుకేషన్‌ను ఇక్కడ అమలు చేస్తామన్నారు. తనకు ఎలాంటి ఇతర కోరికలు లేవని, 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో మీకేమీ అనుమానాలు అక్కర్లేదన్నారు. నల్గొండ వంటి ప్రాంతాల్లో 9 మంది ఉపాధ్యాయులున్నా ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలల పరిస్థితిని నిరసించారు. బదిలీలు చేస్తే ధర్నాలు చేయడం సరికాదన్నారు. “మీ సమస్యలు నాకు వదిలేయండి.. ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు మీ ఇంటికే వస్తాయి. కానీ ఐదేళ్ల పాటు పిల్లల భవిష్యత్తు కోసం నా దారిలోకి వచ్చి పోరాడండి. మండలాల వారీగా క్లస్టర్లను ఏర్పాటు చేసి, పాఠశాలల అభివృద్ధికి మీరే నివేదికలు ఇవ్వండి, వాటిని అమలు చేసే బాధ్యత నాది” అని పిలుపునిచ్చారు. హాస్టల్ సంస్కృతి వల్ల పిల్లలు ఒంటరితనానికి గురై, భవిష్యత్తులో తల్లిదండ్రులను ఓల్డేజ్ హోమ్‌లలో వేసే పరిస్థితి వస్తోందని రేవంత్ రెడ్డి మానవీయ కోణాన్ని స్పృశించారు. టీచర్లు కేవలం బోధకులుగా కాకుండా తల్లిదండ్రుల స్థానంలో ఉండి గైడ్ చేయాలని కోరారు. భాష అనేది కేవలం కమ్యూనికేషన్ సాధనమేనని, జర్మనీ, జపాన్ లాంటి దేశాలపై దృష్టి సారించి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. “ప్రభుత్వ బడిలో చదివితే ఏమవుతావని ఎవరైనా అడిగితే.. తెలంగాణ సీఎం అవుతానని గర్వంగా చెప్పండి” అని వ్యాఖ్యానించి ఉపాధ్యాయుల్లో, విద్యార్థుల్లో సరికొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపారు.

## తన్నీరు వర్సెస్ కల్వకుంట్ల చాపకింద నీరులా పోరు

మెదక్ : సిద్ధిపేట జిల్లాలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ లీడర్ తన్నీరు హరీశ్ రావు నిర్వహించిన పాదయాత్ర గులాబీ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య చర్చకు తెరలేపింది. రైతాంగ సమస్యలు, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి విడుదల డిమాండ్‌తో హరీశ్ రావు చేపట్టిన ఈ యాత్రకు క్షేత్రస్థాయిలో ప్రజలు, రైతుల నుంచి విశేష స్పందన లభించింది. కేవలం నియోజకవర్గ లేదా జిల్లా స్థాయి నిరసనగా కాకుండా, ఒక బహుళ ప్రజా ఉద్యమంగా ఈ యాత్ర రూపాంతరం చెందడంతో రాష్ట్రవ్యాప్తంగా హరీశ్ రావు పాదయాత్ర చేపడితే పార్టీకి పూర్వవైభవం సాధించడం తేలికవుతుందనే అభిప్రాయాలు బీఆర్ఎస్ వర్గాల్లో బలపడుతున్నాయి. అయితే, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌ను మళ్లీ అధికార దిశగా నడిపించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రస్థాయి యాత్రలు, సభల బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కేటీఆర్ నేతృత్వంలోనే కార్యక్రమాలు చేపట్టాలని హైకమాండ్ భావిస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయి కేడర్ మాత్రం మాస్ కనెక్టివిటీ ఉన్న హరీశ్ రావు వైపే ఎక్కువగా మొగ్గుచూపుతున్నట్లు కనిపిస్తోంది. పల్లెల్లో రైతులు, సామాన్య ప్రజలతో కలిసిపోయే నైజం, సుదీర్ఘమైన సంక్షోభ నిర్వహణ అనుభవం ఉన్న హరీశ్ రావు అయితేనే కాంగ్రెస్ వైఫల్యాలను జనంలోకి బలంగా తీసుకెళ్లగలరనే వాదన గులాబీ శ్రేణుల్లో విపరీతంగా పెరిగింది. ఈ భిన్నమైన అభిప్రాయాలు బీఆర్ఎస్ లోపల ఏమైనా అంతర్గత సంక్షోభాన్ని కాకపోయినా నాయకత్వ సవాలు గా చూడవచ్చు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచీ కేటీఆర్ గ్రామీణ, పట్టణ డిజిటల్ నెట్‌వర్కింగ్, నేషనల్ అప్పీల్‌తో కార్పొరేట్ లుక్‌ను ప్రతిబింబిస్తే, హరీశ్ రావు పక్కా తెలంగాణ మాస్, అగ్రికల్చర్, గ్రౌండ్–లెవల్ ఆర్గనైజేషనల్ పవర్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సోషల్ మీడియా బిల్డప్‌ల కంటే భౌతికంగా జనంలో తిరిగే నాయకుడికే ఎక్కువ ఆదరణ ఉంటుంది కాబట్టి, సహజంగానే హరీశ్ రావు గ్రాఫ్ పార్టీ శ్రేణుల్లో పైచేయి సాధిస్తోంది. కేసీఆర్ క్రియాశీల రాజకీయాలకు కొంత దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమైన ప్రస్తుత వాతావరణంలో, పార్టీకి అధిపతి ఎవరు అనే దానిపై ద్వితీయ శ్రేణి నాయకత్వంలో గందరగోళం నెలకొంది. కేటీఆర్‌ను తదుపరి వారసుడిగా ప్రాజెక్ట్ చేసే క్రమంలో హరీశ్ రావు పాత్రను కేవలం సిద్ధిపేట లేదా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధికే పరిమితం చేస్తున్నారనే అసంతృప్తి హరీశ్ మద్దతుదారుల్లో చాలా కాలంగా ఉంది. ఇప్పుడు సిద్ధిపేట పాదయాత్ర సక్సెస్ కావడంతో.. హరీశ్ రావుకు రాష్ట్రస్థాయిలో స్వేచ్ఛనిస్తే కేటీఆర్ ప్రాబల్యం తగ్గుతుందనే ముందస్తు వ్యూహంతోనే ఆయనను మిగతా జిల్లాల్లో పాదయాత్రలకు అనుమతించడం లేదనే ఆరోపణలు విపక్షాల నుంచి రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి మార్క్ అగ్రెసివ్ రాజకీయాన్ని ఎదుర్కోవాలంటే కేవలం హైదరాబాద్ వేదికగా చేసే ప్రెస్ మీట్లు, ట్విట్టర్ వార్లతో సాధ్యం కాదని బీఆర్ఎస్ శ్రేణులు గుర్తించాయి. ఈ క్రమంలోనే ధర్నా చౌక్‌లు, ప్రాజెక్టుల సందర్శన, పొలాల బాట పట్టే విషయంలో హరీశ్ రావు చూపిస్తున్న చొరవను పార్టీ శ్రేణులు స్వాగతిస్తున్నాయి. ఈ పరిణామాలు బీఆర్ఎస్‌లో ప్రత్యక్ష చీలికకు దారితీయకపోయినా, అధికారికంగా పార్టీని నడిపిస్తున్న వర్గానికి, క్షేత్రస్థాయి బలమున్న హరీశ్ వర్గానికి మధ్య ఒక రకమైన సైలెంట్ పవర్ స్ట్రగుల్ నడుస్తోందనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. కేసీఆర్ స్పందించి కేటీఆర్, హరీశ్ రావుల మధ్య స్పష్టమైన బాధ్యతల విభజన చేయకపోతే ఈ నెరేటివ్ పార్టీకి తీవ్ర నష్టం చేకూర్చే అవకాశం ఉంది.





# తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషకాహారం - ఆరోగ్యవంతమైన జీవితానికి తొలి పునాది: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, ఆగస్టు 1 (సమయం ప్రతినిధి):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు-2026 సందర్భంగా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై తల్లిపాల ఆవశ్యకతపై ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నవజాత శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలే సంపూర్ణ పోషకాహారమని అన్నారు. శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలను ప్రారంభించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి అనేక అంటువ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. పుట్టిన తొలి ఆరు నెలల వరకు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం వయస్సుకు తగిన పౌష్టికాహారంతో పాటు రెండేళ్ల వరకు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి కుటుంబంలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్న కలెక్టర్, గర్భిణులు, బాలింతలకు శాస్త్రీయ అవగాహన కల్పిస్తూ తల్లిపాలను ప్రోత్సహించేందుకు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తల్లి, శిశు ఆరోగ్య సంరక్షణలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి వాటి ప్రోత్సాహం అత్యంత అవసరమని అన్నారు. అలాగే, శిశువుకు అవసరమైనంత తల్లిపాలు ఇచ్చిన తర్వాత అదనంగా మిగిలే తల్లిపాలను వృథా చేయకుండా సుషేనా ఫౌండేషన్ దాత్రి మిల్క్ బ్యాంక్‌కు దానం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. తల్లిపాలు అందించే అవకాశం లేని శిశువులకు ఈ పాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అంతకుముందు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను చాటిచెప్పే ప్లకార్డులు, నినాదాలతో సాగిన ర్యాలీలో తల్లులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు, ఆరోగ్య సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రంగా అజ్మీరా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ అధికారి జరీనా, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అమరచింతలో కాసం కృష్ణమూర్తి 20వ వర్ధంతి



అమరచింత : కాసం కృష్ణ మూర్తి 20వ వర్ధంతిని అమరచింత మండలకేంద్రంలో తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘశీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సంఘశీ వనపర్తి జిల్లా అధ్యక్షులు యస్. అజయ్. అమరచింత మండలఅధ్యక్షులు కె. శంకర్‌లు మాట్లాడుతు1921లో నిర్మల్ గ్రామం దేవరుప్పాలమండలం జనగామ జిల్లాలో జన్మించిన ఆయన 1ఆగస్టు 2006మృతి చెందారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సంఘశీ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేయడం జరిగింది వీర తెలంగాణ పోరాటం లో ఆయన పాత్ర మరిచి పోనిదని కొనియాడారు జనగామ ఇబ్రహీంపట్నం రాచకుండా ప్రాంతలల్లో పేదలకు భూములు పంచాలని కూలి రేట్లు పెంచాలని వెట్టి చాకిరీ రద్దుకై అనేక ఉద్యమాలు నిర్వహించి. బ్రతికి ఉన్నంత కాలం నితిగా నిజాయితీ గా జీవితాన్ని గడిపి కార్యకర్తలకు ఆదర్శ ప్రాయుడయ్యారు. అయన చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అయన ఆశయాలసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో డి. భగవంతు. బేక్కేశీ కురుమన్న. సుగురు వేణు. గోపాల్. శాంతి వర్ధన్ శ్రీను చింటు పాల్గొన్నారు.

## కష్టతరంగా మారిన రేషన్ కార్డు కేవైసీ విధానం
## గురుకుల, సంక్షేమ హాస్టల్ల దగ్గరనే విద్యార్థుల ఈ కేవైసీని పూర్తి చేయాలి

**-జె.వెంకటపతి రాజు పుడమి ఫౌండేషన్ చైర్మన్**



హైదరాబాద్ : రేషన్ కార్డుల కేవైసీ సంబంధించిన వివరాలు ఈనెల చివరి వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిన విషయం అందరికీ తెలిసిందే. కానీ ఈ కేవైసీ పూర్తి చేయడం కోసం ఇతర ప్రాంతాలలో వివిధ గురుకుల పాఠశాలలో మరియు సంక్షేమ హాస్టల్లో చదువుకుంటున్న అనేక మంది విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గురుకులాల నుండి ఒకేసారి పిల్లలను పంపించడం కుదరదని పాఠశాల ప్రిన్సిపల్ చెప్తున్నారు. కావున పిల్లల చదువులకు అంతరాయం కలగకుండా ఒకే దగ్గర ఉంటున్న వందలాది మంది పిల్లల దగ్గరికి అక్కడ అందుబాటులో ఉన్న రేషన్ డీలర్లను ఈ కేవైసీ పూర్తి చేయడం కోసం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము.ప్రభుత్వం వీటిపై వెంటనే స్పందించి తగు నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఇట్టి కార్యక్రమంలో పుడమి ఫౌండేషన్ ఉపాధ్యక్షులు రవికుమార్. శ్రీనివాస్. కోరిపవన్. దేవకినందన్. అరవింద్. సాయివిశాల్. నాని. తదితరులు పాల్గొన్నారు.

## కమలం కొత్త వ్యూహం

హైదరాబాద్ : తెలంగాణాలో బీజేపీ రాజకీయ వ్యూహాన్ని మార్చింది. కేంద్ర నాయకత్వం తలంటడంతో ఇప్పుడు తెలంగాణ కమలం పార్టీ నేతలు యాక్టివ్ అయ్యారు. సోషల్ మీడియాలో తెలంగాణ నాయకులు వెనకబడి ఉండటాన్ని కేంద్ర నాయకత్వంతో పాటు రాష్ట్ర పార్టీ ఇన్ ఛార్జులు కూడా తప్పుపట్టారు. డిజిటల్ యుగం నడుస్తున్న సమయంలో ఇలా వెనకబడి ఉంటే పార్టీ ఎలా ఎదుగుతుందని ప్రశ్నించారు. ఇకపై రీల్స్ చేయడం, మీమ్స్ వంటి వాటితో ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నించాలని, తెలంగాణలోని ప్రతి ఒక్క బీజేపీ నేతల సోషల్ మీడియాలో యాక్టివ్ కావాలని, వారి ఫాలోయిర్స్ సంఖ్య పెరగాలని ఆదేశాలు జారీచేసింది.తెలంగాణ ప్రభుత్వం. ఇటీవల సోషల్ మీడియా వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భవించి ఎన్ని మిలియన్ల మందికి దగ్గరయిందో గుర్తుకు తెచ్చుకోవాలని రాష్ట్ర నేతలకు బీజేపీ కేంద్ర నాయకత్వం క్లాస్ పీకింది. తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీల విధానాలపై సోషల్ మీడియా వేదికగా బీజేపీ దూకుడు పెంచింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం, వ్యూహాత్మక పోస్టలతో ట్రెండింగ్ సృష్టించడం మరియు డిజిటల్ క్యాంపెయిన్ల ద్వారా కేడర్‌లో జోష్ నింపడం వంటి అంశాలపై ఆ పార్టీ ప్రధానంగా దృష్టి సారించింది. ఇందుకోసం ప్రతి నేత సోషల్ మీడియాను హ్యాండిల్ చేసేందుకు సిబ్బందిని కూడా నియమించుకున్నారని తెలిసింది.

## ఎస్ఐఆర్ ప్రక్రియకు ఆగస్టు 10 వరకు గడువు..
## నాణ్యతపై దృష్టి పెట్టాలి: ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్





రంగారెడ్డి, ఆగస్టు 1 (సమయం ప్రతినిధి): ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి ఆగస్టు 10 వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో, అదనపు సమయాన్ని పూర్తిగా నాణ్యత పెంపునకు వినియోగించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు.శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డిజిటైజ్ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు, ఫొటోలు, పత్రాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను జాగ్రత్తగా చేపట్టడంతో పాటు, మరణించిన లేదా చిరునామా మారిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో 3,501 పోలింగ్ కేంద్రాలు, 36,99,743 మంది ఓటర్లు ఉన్నారని, ప్రస్తుతం 63.53 శాతం మ్యాపింగ్ పూర్తయిందన్నారు. ఆగస్టు 10 వరకు లభించిన అదనపు గడువును సద్వినియోగం చేసుకొని పెండింగ్ కేసులను పూర్తి చేసి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నాణ్యతతో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. సమీక్ష అనంతరం నవీన్ కుమార్ కొంగర, బొంగులూరు, ఎల్‌బీనగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి బీఎల్‌వోలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

## చౌరస్తా విస్తరణ పనుల కోసం.. రోడ్డెక్కిన విద్యార్థులు..

**విస్తరణ పనులను చేపట్టండి.. మా ప్రాణాలను కాపాడడంటూ విద్యార్థులు ఆందోళన..**
**సామాజిక వేత రాము ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా..**
**కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోని అధికారులు రాము ఆవేదన..**



షాద్నగర్ : ప్రభుత్వ లేఅవుట్, నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులు చౌరస్తా విస్తరణ పనులను చేపట్టి మా ప్రాణాలను కాపాడండి అంటూ సామాజికవేత్త రాము ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం పట్టణ ముఖ్య కూడలిలో ఆందోళన చేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనునిత్యం షాద్నగర్ పట్టణంలో జనాభా పెరుగుదలతో పాటు వాహనాల రద్దీ ఎక్కువైందని, దీనికి తోడు వ్యాపారస్తులు (దుకాణాల యజమానులు) తమకున్న స్థలం కంటే ప్రభుత్వ స్థలం ఆక్రమించడంతో, రోడ్డు ఇరుకుగా మారి రోడ్డు ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయన్నారు.. ఇప్పటికే ఎంతోమంది అమాయకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు..

**కలెక్టర్ ఆదేశాలు పట్టించుకోవడం లేదు**

ప్రజావాణిలో చౌరస్తా విస్తరణ పనుల కోసం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తే, స్పందించిన కలెక్టర్ విస్తరణ పనులు అంశమును చూడాలంటూ కింది స్థాయి అధికారులను ఆదేశించారన్నారు.. అయినప్పటికీ కలెక్టర్ ఆదేశాలను షాద్నగర్ అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని, ఇందులో ఆంతర్యం ఏమిటని ఆయన అధికారులను ప్రశ్నించారు..

**మూడు రోజులు ముచ్చటగా హడావుడి..**

ఆర్డీఓ సరిత గత కొన్ని రోజుల క్రితం అన్ని శాఖల అధికారులు, నాయకులు, ప్రజా సంఘాలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అందరి ఆమోదంతో విస్తరణ పనులకు శ్రీకరం చుట్టారన్నారు.. కానీ మున్సిపల్,ఆర్ అండ్ బి అధికారులు మూడు రోజుల ముచ్చటగా రోడ్డు ఆక్రమించిన అక్రమ నిర్మాలను తూతూమంత్రంగా తొలగించి హడావుడి చేశారని , గత రెండు రోజుల నుండి మళ్లీ ఎలాంటి విస్తరణ పనులు చేపట్టకుండా మౌనం వహిస్తున్నారని రాము, రాజు గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఆందోళన విరమింప చేసిన పోలీసులు :** చౌరస్తా విస్తరణ పనుల కోసం రోడ్డుపై ఆందోళన చేస్తున్న విద్యార్థులను, సామాజికవేత్త రాముతో పట్టణ ఎస్ఐ సుశీల మాట్లాడి ఆందోళనను విరమింప చేశారు.. ఈ అంశంలో ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఎవరి స్వలాభం కోసం కాదు. రోడ్డు ప్రమాదాలు నివారించి, ప్రజల ప్రాణాలను కాపాడుట కోసం రోడ్డు విస్తరణకు కొందరు వ్యాపారస్తులు, చిరు వ్యాపారులు సహకరించడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.. ఇది ఎవరి స్వలాభం కోసం కాదని అందరి ప్రాణాల కోసమేనని దీనికి వ్యాపారస్తులు అందరు సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.


# భారత్ మాల గట్టు మండల అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

## భారత్ మాల అప్రోచ్ రోడ్డు కోసం 167 రోజుల రిలే నిరాహార దీక్షను విరమణ చేయించి నిమ్మరసం అందజేసిన ఎమ్మెల్యే ...





**గద్వాల :** గద్వాల నియోజకవర్గం లో గట్టు మండలం రాయపురం స్టేజ్ దగ్గర గట్టు మండలం భారత్ మాల అప్రోచ్ రోడ్డు నిర్మాణాలకు కొరకు 167 రోజులు దీక్ష చేసిన రాయపురం గ్రామస్తులకు దీక్షను విరమించి నిమ్మరసం ను అందజేసి భారత్ మాల రోడ్డు గట్టు మండలం అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి లి భూమి పూజ చేసి పనులను ప్రారంభించడం జరిగింది. భరత్ మాల గట్టు మండలం లోని అప్రోచ్ రోడ్డు నిర్మాణం కొరకు 167 రోజులు మాజీ సింగల్ విండో చైర్మన్ రాముడు ఆధ్వర్యంలో గ్రామస్తులు మండలంలోని ప్రజలు ప్రతిరోజు రిలే నిరాహార దీక్షను చేసి చివరికి రోడ్డు నిర్మాణం ఎమ్మెల్యే సహకారంతో సాధించుకోవడం జరిగింది. లిఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గంలో గట్టు మండలంలో భారత్ మాల రోడ్డు నిర్మాణం కావడంతో గట్టు మండలంలోని రాయపురం స్టేజి దగ్గర అప్రోచ్ రోడ్డు నిర్మాణం కొరకు గ్రామస్తులు 167 రోజులపాటు రిలే నిరాహార దీక్షను చేయడం జరిగింది. గద్వాల నియోజకవర్గం గట్టు మండల అభివృద్ధి కొరకు ఈ ప్రాంతంలోని భారత్ మాల వంటి రహదారి నిర్మాణం పనులు కావడంతో ఈ ప్రాంతం నుండి మైసూర్ పూనే వరకు రోడ్డు నిర్మాణం ఇటు తమిళనాడు వరకు రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుందని దూరదృష్టతో ఆలోచించి అధికారులతో దృష్టికి తీసుకెళ్లి ఈ రోడ్డు నిర్మాణముకు కృషి చేయడం జరిగింది.భవిష్యత్తులో తెలంగాణ కర్ణాటక తమిళనాడు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో రహదారి లకు వెళ్లడానికి సులభం అవుతుంది అదేవిధంగా వ్యాపార




సంబంధాలు అభివృద్ధి చెందుతాయి అదేవిధంగా రైతులు పంటలను ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి దిగుమతి చేయడం వల్ల రైతుల కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందారు అదేవిధంగా ఈ ప్రాంతంలో ఇండస్ట్రీలు రావడం జరుగుతుంది . ఇండస్ట్రీ రావడంతో యువతకు ఉద్యోగ అవకాశాలు కూడా వచ్చే అవకాశం ఉన్నది కాబట్టి ఈ మార్గంలో అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలని భారత్ మాల అధికారులతో మాట్లాడి ప్రభుత్వంతో దృష్టికి తీసుకెళ్లి మంత్రుల దృష్టికి తీసుకెళ్లి ఈ రోడ్డును మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఇటీవలే భారత్ మాల రోడ్డు సమీపం లో రాయపురం స్టేజి దగ్గర 133 హై టెన్షన్ సబ్టేషన్ మంజూరు కావడం జరిగింది. వాటిని కూడా 220 హై టెన్షన్ సబ్ స్టేషన్ గా మార్చే విధంగా ప్రయత్నం చేయడం జరుగుతుంది. దీనితో ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్యను కొంతమేరకు తగ్గించడం జరుగుతుంది రైతులకు 24 గంటల కరెంటు లభిస్తుందని పేర్కొన్నారు. ఎ లెనోవా ప్రభావం వల్ల ఈ సంవత్సరం వర్షపాతం తక్కువగా ఉన్నది అయినా కూడా రైతులకు ఎలాంటి నీటి సమస్య ఉండకుండా ఉండాలని నీటిని నిలువ ఉంచడం జరిగింది రైతులకు రెండు పంటలకు నీళ్లు అందించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. భవిష్యత్తులో గట్టు మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధంగా నా వంతు సహాయశక్తుల కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమంతు ూజూ ఛైర్మెన్ వెంకటేష్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, మాజీ ఎంపీపీ విజయ్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సర్పంచ్, మాజీ సింగల్ విండో రాముడు నాయకులు గద్వాల తిమ్మప్ప, సిద్ది రామప్ప అలీ, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ కృష్ణ, రాజప్ప గౌడు, రామకృష్ణ నాయదు,మధుసూదన్ రెడ్డి, గోవిందు సిద్దు, ఆనంద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం : అనుమతి లేని సభలు, ర్యాలీలపై కఠిన చర్యలు జిల్లా ఎస్పీ

**ఆగస్టు 1 నుంచి 31 వరకు జిల్లాలో "30 పోలీస్ యాక్ట్-1861" అమలు**
**ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ సభలు, ర్యాలీలు, ధర్నాలు, భారీ సమావేశాలకు అనుమతి లేదు**
**ప్రజల సహకారంతోనే ప్రశాంత వాతావరణం సాధ్యం నిబంధనలు తప్పనిసరి**
**శాంతియుత వనపర్తి నిర్మాణానికి పోలీసు శాఖతో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి**



వనపర్తి, ఆగస్టు -01: జిల్లాలో శాంతిభద్రతలను మరింత పటిష్టంగా కొనసాగించడం, ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి అంతరాయం కలగకుండా చూడడం, అవాంఛనీయ సంఘటనలను ముందస్తుగా నివారించడం లక్ష్యంగా ఆగస్టు 1 నుంచి ఆగస్టు 31 వరకు "30 పోలీస్ యాక్ట్-1861" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లా పరిధిలో ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశమున్న ఎలాంటి కార్యక్రమమైనా సంబంధిత పోలీసు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించరాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, నిరసన కార్యక్రమాలు, భారీ స్థాయి సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించడం పూర్తిగా నిషేధమని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను పోలీసులు ఏమాత్రం ఉపేక్షించబోరని, "30 పోలీస్ యాక్ట్" నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజల భద్రత, ప్రశాంతత మరియు సామాజిక శాంతిని పరిరక్షించడమే ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఏ సంస్థ, సంఘం లేదా వ్యక్తి బహిరంగ కార్యక్రమాలు నిర్వహించదలచినట్లయితే సంబంధిత పోలీసు అధికారులను ముందుగానే సంప్రదించి అనుమతి పొందాలని సూచించారు. చట్టాలను గౌరవించడం ప్రతి పౌరుని బాధ్యత అని, ప్రజల సహకారంతోనే జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని మరింత బలోపేతం చేయగలమని ఎస్పీ తెలిపారు. ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## SR విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో CBSE క్లస్టర్-VII వాలీబాల్ టోర్నమెంట్ అట్టహాసం









మహబూబ్ నగర్ : SR విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జదీూజు క్లస్టర్-VII వాలీబాల్ టోర్నమెంట్ అట్టహాసంగా నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 163 పాఠశాలల నుంచి 2500 మంది విద్యార్థులు పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించాయి. ఈ సందర్భంగా గద్వాల జిల్లా కలెక్టర్ శ్రీ రిజ్వాన్ బాషా షేక్ , సీబీఎస్ఈ అబ్జర్వర్ శ్రీ శేషు , ఎస్ఆర్ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ రాముడు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి సునీత గోన పాల్గొన్నారు. విజేతలు, రన్నరప్ జట్లకు గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సీబీ ఎస్ఈ అబ్జర్వర్ శేషు ట్రోఫీలను అందజేసి విద్యార్థులను అభినందించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ, గద్వాల జిల్లాలో ఇంత పెద్ద స్థాయి లో పోటీలను నిర్వహించడం గర్వకారణం. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొంది స్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రీడలను తమ జీవితంలో భాగంగా చేసుకుని, వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని ప్రోత్సహించారు. SR విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ రాముడు మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి సునీత గోన మాట్లాడుతూ, ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇవ్వడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. వివిధ వయో విభాగాల్లో జరిగిన ఉత్కంఠభరిత పోటీల్లో క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని కనబరిచారు. విజేతల వివరాలు ఇలా ఉన్నాయి:

అండర్-14 విభాగం:
విజేతలు - హీల్ స్కూల్, ఏలూరు, ఆంధ్రప్రదేశ్
రన్నరప్ -- ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూల్, తెలంగాణ
అండర్-17 విభాగం:
విజేతలు - శ్రీ విద్యా నికేతన్ స్కూల్, తిరుపతి, ఆంధ్రప్రదేశ్
రన్నరప్ - నవభారత్ పబ్లిక్ స్కూల్, తెలంగాణ
అండర్-19 విభాగం:
విజేతలు - శ్రీ విద్యా నికేతన్ స్కూల్, తిరుపతి, ఆంధ్రప్రదేశ్
రన్నరప్ - పద్మావతి విద్యాలయ, ఆంధ్రప్రదేశ్

టోర్నమెంట్‌ను అత్యంత సక్రమంగా, వైభవంగా నిర్వహించిన ఎస్ఆర్ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యాన్ని పాల్గొన్న పాఠశాలల ప్రతినిధులు, క్రీడాకారులు అభినందించారు. ఈ టోర్నమెంట్ యువ క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా, వారి ప్రతిభను ప్రదర్శించేందుకు చక్కటి వేదికగా నిలిచింది.

## శారీరక దృఢత్వమే సమర్థ పోలీసింగ్‌కు పునాది: జిల్లా ఎస్పీ డి. జానకి




మహబూబ్‌నగర్, ఆగస్టు 1 (సమయం ప్రతినిధి): జిల్లా పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ శారీరకంగా దృఢంగా, మానసికంగా అప్రమత్తంగా ఉండి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ సూచించారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో నిర్వహించిన వారాంతపు కవాతుకు ఎస్పీ హాజరై పరేడ్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులు, పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, వాటిని సమర్థవంతంగా నిర్వహించేందుకు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, అప్రమత్తత ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రతిరోజూ వ్యాయామం, పరేడ్, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా పాల్గొని తమ శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వం కూడా కీలకమని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో సమయ పాలన, అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణను పాటిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి పోలీసు సిబ్బంది తమ సేవల ద్వారా పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ఆర్‌ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, రూరల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఏబీవీపీ నాయకుడు సొప్పరి నరేందర్



కేశంపేట: కేశంపేట మండల పరిధిలోని కోనాయపల్లి గ్రామానికి చెందిన ఏబీవీపీ నాయకుడు సొప్పరి నరేందర్ శనివారం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారి సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వంపై విశ్వాసంతో యువత బీఆర్ఎస్‌లో చేరడం ఆనందదాయకమని పేర్కొన్నారు. పార్టీలో చేరిన సొప్పరి నరేందర్ కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తూ, పార్టీలో తగిన గుర్తింపు, ప్రోత్సాహం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి,సర్పంచులు సొప్పరి ధనలక్ష్మి రామకృష్ణ, వేణు గోపాల చారి, మాజీ సర్పంచ్ కామ్లెకార్ నవీన్ కుమార్, నాయకులు శ్రీహరి యాదవ్, సలీం, రంగు శ్రీకాంత్, అయిలాపురం సంతోష్ రెడ్డి, కాకర్ల సునీల్, చిత్రమోని చెన్నయ్య, సోమరాజు మహేష్, రంగు రాకేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సకాలంలో UDID కార్డులు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలి

## సదరం కేంద్రాల పనితీరును కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్



**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 01:** నల్లమల్ల చెంచుల కోసం ప్రత్యేక మొబైల్ క్యాంపులు,శ్రవణ లోపం ఉన్న దివ్యాంగుల పరీక్షలకు సౌండ్‌ప్రూఫ్ గది ఏర్పాటు చేయాలి, అచ్చంపేట ఆస్పత్రిలో ప్రత్యేక సదరం క్యాంప్ ఏర్పాట్లు, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా చేరేలా సదరం యూనిక్ డిసెబిలిటీ ఐడీ (UDID) కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ (SERP) సీఈవో దివ్య దేవరాజన్ జిల్లా కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు డిఆర్డిఎ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సదరం సర్టిఫికెట్ల జారీపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆమె ఈ సందర్భంగా జిల్లాల వారీగా UDID కార్డుల జారీ, సదరం కేంద్రాల పనితీరు, పెండింగ్ దరఖాస్తులు, వైద్య బోర్డుల సేవలు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది అందుబాటు, ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్నారు. సీఈవో దివ్య దేవరాజన్ మాట్లాడుతూ..... రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఆధునిక సౌకర్యాలతో సదరం UDID కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వ్యయం చేస్తోందని ఆమె తెలిపారు. ప్రతి కేంద్రంలో సేవలను వేగవంతం చేసేందుకు ఇద్దరు డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమిస్తున్నట్లు వెల్లడించారు. గత 75 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 27,839 మంది దివ్యాంగులకు UDID కార్డులు ఆమోదించడం జరిగిందని, ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అత్యవసరంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జనాభా అధికంగా ఉన్న జిల్లాలు, పట్టణ ప్రాంతాల్లో దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా అవసరమైతే రెండో సదరం UDID కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అలాగే జిల్లా కలెక్టర్లు స్వయంగా సదరం కేంద్రాలను సందర్శించి అక్కడి సేవల నాణ్యత, వైద్య పరీక్షల నిర్వహణ, దరఖాస్తుల పరిష్కార వేగం, ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., జిల్లాలో ప్రతి అర్హులైన దివ్యాంగుడికి UDID కార్డు అందేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. సదరం క్యాంపు కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఉన్న లోటుపాట్లను గుర్తించడం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.... పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, దివ్యాంగుల సంక్షేమ శాఖ, డి ఆర్ డి ఏ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి దివ్యాంగులకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. ప్రత్యేకంగా నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని అచ్చంపేట నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన నల్లమల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న చెంచు గిరిజనుల కోసం ప్రత్యేక మొబైల్ సదరం (UDID) శిబిరాలను నిర్వహణతో పాటు అచ్చంపేట ప్రభుత్వాసుపత్రిలో సదరం క్యాంపు ఏర్పాట్ల ప్రతిపాదనల సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న చెంచు గిరిజనులు జిల్లా కేంద్రానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవడం కష్టసాధ్యమైన నేపథ్యంలో, వైద్య బృందాలు నేరుగా వారి గ్రామాలకు వెళ్లి అక్కడే దివ్యాంగులను గుర్తించడం, వైద్య పరీక్షలు నిర్వహించడం, అవసరమైన ధ్రువీకరణ పూర్తి చేయడం, UDID నమోదు ప్రక్రియను చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజల వద్దకే చేరాలన్న లక్ష్యంతో ఈ ప్రత్యేక మొబైల్ క్యాంపులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా శ్రవణ లోపం (హియరింగ్ ఇంపెయిర్మెంట్) ఉన్న దివ్యాంగులను శాస్త్రీయ పద్ధతిలో గుర్తించి వారికి ఖచ్చితమైన ధ్రువీకరణ అందించేందుకు నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన సౌండ్‌ప్రూఫ్ గదిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏర్పాటు చేసే గదిలో అత్యాధునిక ఆడియోమెట్రీ పరీక్షలు నిర్వహించడం ద్వారా వినికిడి లోపాన్ని కచ్చితంగా నిర్ధారించి, అర్హులైన వారికి త్వరితగతిన UDID కార్డులు జారీ చేయవచ్చని తెలిపారు. ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తే జిల్లాలోని శ్రవణ లోపం ఉన్న దివ్యాంగులు ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన అవసరం ఉండాలని, దివ్యాంగులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, అన్ని సేవలను ఒకే వేదికపై వేగంగా అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, గిరిజన, దూర ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా UDID సదరం నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించి దివ్యాంగులను గుర్తించి నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అధికారులు కూడా అదే నిబద్ధతతో పనిచేసి ఒక్క అర్హుడూ ప్రభుత్వ సేవలకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్డిఏ అదనపు పీడీ రాజేశ్వరి, డి ఆర్ డి ఏ అధికారులు, సదరం నిర్వహణ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సంగంబండ డ్యాం నుంచి మాగనూరు, కృష్ణ మండలాలకు సాగునీటి విడుదల



సమయం ప్రతినిధి: నేరుడుగం గ్రామ సర్పంచ్ బాబు, ఉప సర్పంచ్ రవి మరియు మంత్రి సోదరుడు వాకిటి శేషగిరి. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సంగం బండ డ్యాం నుండి మాగనూరు కృష్ణ మండలాలకు సాగునీటిని వ్యతిరేజేసే కార్యక్రమంలో పాల్గొన్నారు.సంగంబండ డ్యామ్ నుంచి మాగనూరు, కృష్ణ మండలాలకు హై లెవెల్ రైట్ మెయిన్ కెనాల్, లో లెవెల్ రైట్ మెయిన్ కెనాల్‌లను రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరిలి సోదరుడు వాకిటి శేషగిరి శనివారం రోజు పూజా కార్యక్రమాలు నిర్వహించి, కెనాల్‌ను ప్రారంభించి సాగునీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా వాకిటి శేషగిరి మాట్లాడుతూ... సంగంబండ డ్యాం నుంచి కృష్ణ, మాగనూరు మండలాల రైతుల పంట పొలాలకు నీటిని విడుదల చేయడం జరిగిందని తెలిపారు. సరైన సమయంలో వర్షాలు కురవడంతో పాటు, ఎగువ కర్ణాటక నుంచి అటు భీమా, ఇటు కృష్ణా నదుల నుంచి వరద ప్రవాహం రావడం, పంప్ హౌస్‌ల నుంచి సంగంబండ రిజర్వాయర్‌కు నీటి పంపింగ్ ప్రారంభించి సాగునీటిని తరలించామని, దీంతో నియోజకవర్గ పరిధిలోని మక్తల్, మాగనూరు, కృష్ణ మండలాలకు సాగునీటిని కెనాల్‌ల నుంచి ప్రస్తుతం విడుదల చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే సంగంబండ బండలిను పగలగొట్టి, దాదాపు 20కి పైగా గ్రామాలకు మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో సాగునీరు అందించామని గుర్తు చేశారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా పాటుపడుతుందని అన్నారు.కార్యక్రమంలో పాల్గొన్నవారు: AE సంజయ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, రవికుమార్, గోవర్ధన్, బ్యాకరి సురేష్, అప్రోజ్, కృష్ణ, మాగనూరు మండలాల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సియం రేవంతన్నకు హృదయపూర్వక ధన్యవాదాలు



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 01:తెలంగాణ రాష్ట్రంలోని 436 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత పది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులకు ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు ఇవ్వాలి అని ఒక విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకోవడమే కాకుండా ఈరోజు ఒకటవ తేదీన జీతాలు విడుదల చేసిన శుభ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి గెస్ట్ లెక్చరర్స్ సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా గెస్ట్ లెక్చరర్స్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సదానందం గౌడ్ మాట్లాడుతూ గత పదేండ్ల పాలనలో మూడు నెలలకు, ఆరు నెలలకు ,సంవత్సరానికి జీతాలు తీసుకుని అనేక ఇబ్బందులు పడ్డాం. కానీ ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగస్తులు అందరు సమానమే అనే భావనతో ఉద్యోగులందరని సంతోషకరంగా ఉంచాలని ఒకే లక్ష్యంతో గెస్ట్ లెక్చరర్స్ కు కూడా ఒకటవ తేదీన జీతాలు చెల్లించడం చాలా సంతోషదాయకం అన్నారు. ఇందుకు సహకరించిన గెస్ట్ లెక్చరర్స్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు. అదే విధంగా గెస్ట్ లెక్చరర్స్ అందరికి ఉద్యోగ భద్రత కల్పించి చరిత్ర లో చిరస్థాయిగా నిలిచిపోవాలని ఒక ప్రకటనలో సదానందం గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## మిడిల్ క్లాసు కష్టాలు...

హైదరాబాద్ : ఒకటో తారీకు జీతం వస్తుంది. ఆ తర్వాత ఈఎంఐ కట్టాలి. క్రెడిట్ కార్డు బిల్లు కట్టాలి.. ఇంటి రెంట్ కట్టాలి. పిల్లల స్కూల్ ఫీజులు కట్టాలి. నెలవారి ఖర్చుకు ఎంతోకొంత ఎకౌంట్లో ఉంచుకోవాలి. ఇవన్నీ చేసిన తర్వాత ఏం మిగులుతుంది..జీతం ఆవగింజంత ఉంటే.. ఖర్చులు మామిడికాయ సైజులో ఉంది. ఇలాంటప్పుడు నాలుగు రాళ్లు వెనక వేయడం కాదు కదా.. కనీసం జీవితాన్ని ముందుకు సాగించడం కూడా కష్టమే. నచ్చినవి తినలేము. ఇష్టమైన వాటిని కొనుగోలు చేయలేము. బాగున్న వాటిని సొంతం చేసుకోలేము. ఊహల్లో బతకడం.. కష్టాలను తిట్టుకోవడం.. ఇదే మిడిల్ క్లాస్ జీవితం..మనదేశంలో పేదవాళ్లు ఒక అంచనాలో బతుకుతారు. డబ్బున్న వాళ్లు కూడా ఒక అంచనాలో బతుకుతారు. కానీ మిడిల్ క్లాస్ వాళ్ళు ఎటువంటి అంచనా వేసుకోలేరు. ఎందుకంటే వాళ్లకు ప్రతి విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఏవైనా నిర్ణయాలు తీసుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని.. ముందుగానే జాగ్రత్త పడతారు. జాగ్రత్తగా ఉన్నంత మాత్రాన ఖర్చులు ఆగవు కదా.

## మల్దకల్ పీఎం శ్రీ జడ్పీ హైస్కూల్‌లో నూతన తరగతి గదుల ప్రారంభం

### రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అదనపు కలెక్టర్ నర్సింగరావు





సమయం ప్రతినిధి : జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలల ద్వారానే అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్, డీఈఓ విజయలక్ష్మి, ఎంఈఓ జి. సురేష్, ఆలయ చైర్మన్ ప్రహ్లాద్ రావు, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, ఎస్సై కొండ శ్రీహరి, వైస్ సింగిల్ విండో చైర్మన్ కే. విష్ణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్ గౌడ్, మాజీ ఎంపీపీలు రాజారెడ్డి, విజయ్, మాజీ వైస్ ఎంపీపీ వీరన్న, విక్రమ్ సింహా రెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, రాజు, మాజీ సర్పంచ్‌లు యాకోబు, ప్రతాప్, కార్యకర్తలు తిమ్మరాజు, ప్రభాకర్, నరేందర్, మధు, పెద్దపల్లి అజయ్తో పాటు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది



దేవరకొండ: ఆగస్టు 1(సమయం ప్రతినిధి): ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12,000 భృతి అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పూర్తిగా విస్మరించి ఆటో కార్మికులను మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర నాయకులు ఎండి. జానీబాబా ఆరోపించారు. శనివారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ....రాష్ట్రంలో ఆటో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రయాణికులు తగ్గిపోవడంతో ఆదాయం లేక బ్యాంకు రుణాల కిస్తీలు చెల్లించలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆర్థిక భారంతో కుటుంబాలను పోషించడం కూడా కష్టంగా మారిందని, కొంతమంది ఆటో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడే దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా మాట తప్పడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఎన్నికల హామీలను అమలు చేసి ఆటో కార్మికులకు ప్రకటించిన రూ.12,000 వార్షిక భృతి అందించాలని, వారి సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందిన లేదా ఆత్మహత్యలకు పాల్పడిన ఆటో కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సూక్య నాయక్, ఇసుబ్, చందు, పాండు, బొజ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## క్యూర్ కు 28 శాతం మార్కులే

హైదరాబాద్ : 70 ఏళ్ల చరిత్ర కలిగిన జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన 'క్యూర్' ముసాయిదా బిల్లు మహానగర పాలనా సంస్కరణల విషయంలో ఆశించిన స్థాయిలో లేదని విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. బెంగళూరు కేంద్రంగా పని చేసే పాలనా అధ్యయన సంస్థ 'జనాగ్రహ' నిర్వహించిన సమీక్షలో ఈ ముసాయిదాకు కేవలం 28 శాతం మార్కులే లభించాయి. పొరుగు రాష్ట్రమైన కర్ణాటక తీసుకొచ్చిన 'గ్రేటర్ బెంగళూరు అథారిటీ' (జీబీఏ చట్టం 2024) సాధించిన 38 శాతంతో పోలిస్తే.. హైదరాబాద్ కోసం ప్రతిపాదించిన ఈ బిల్లు సంస్కరణల పరంగా వెనుకబడి ఉందని సదరు అధ్యయనం ఎత్తిచూపింది.హైదరాబాద్ నగరాన్ని సమగ్రమైన ఏకైక అర్బన్ రీజియన్‌గా ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు ఒక అధికారిక ఏకీకృత వ్యవస్థ లేకపోవడమే ఈ బిల్లులోని ప్రధాన లోపంగా విశ్లేషణ పేర్కొంది. ప్రస్తుతం రవాణా, గృహ నిర్మాణం, మురుగునీటి పారుదల, భూ వినియోగం వంటి కీలకమైన బాధ్యతలను వివిధ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీలు ఎవరికి వారే స్వతంత్రంగా నిర్వహిస్తున్నాయని నివేదిక తెలిపింది. వేర్వేరు సంస్థల మధ్య అనుసంధానం లోపించడంతో నగర అభివృద్ధి ప్రణాళికలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయని స్పష్టం చేసింది.నగర పాలన సమర్థవంతంగా సాగాలంటే ప్రజలు ఎన్నుకున్న స్థానిక ప్రజాప్రతినిధులకు సమస్యలను తక్షణమే పరిష్కరించే అసలైన అధికారాలు ఉండాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు ద్వారా మేయర్, కౌన్సిల్‌ల అధికారాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని.. నైబర్‌హుడ్ పరిధిలోని నిర్ణయాల్లో స్థానిక పౌరులకు భాగస్వామ్యం కల్పించేలా స్పష్టమైన నిబంధనలు చేర్చాలని సూచించారు. నగర పరిపాలనా వ్యవస్థను నిరంతరం జవాబుదారీగా ఉంచేందుకు స్వతంత్ర పర్యవేక్షణ, తనిఖీ యంత్రాంగాన్ని నెలకొల్పాలని పేర్కొన్నారు. మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీ (ఎంపీసీ), హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎమ్‌డీఏ), ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉండే అత్యున్నత పాలనా మండలి విధుల మధ్య ఎలాంటి పునరావృతం లేకుండా స్పష్టమైన విభజన ఉండాలని పేర్కొన్నారు.బృహత్తర నగరాల నిర్వహణలో భారత దేశంలోనే హైదరాబాద్ ఒక మార్గదర్శక మహానగర పాలనా నమూనాగా ఎదిగేందుకు గొప్ప అవకాశం ఉందని జనాగ్రహ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ విశ్వనాథన్ అభిప్రాయ పడ్డారు.

# విద్యా ప్రమాణాలతో పాటు ఆరోగ్యంపైనా ప్రత్యేక దృష్టి సారించాలి

## అనాథలు, వలస కార్మికుల పిల్లల పట్ల మరింత బాధ్యతతో వ్యవహరించాలని ఉపాధ్యాయులకు డిఇఓ సూచన





నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి (ఆగస్టు 01): నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని బొందలపల్లి గ్రామంలో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల, యూఆర్ఎస్ (అర్బన్ రెసిడెన్షియల్) పాఠశాల, ప్రాథమి కోన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ ఏ. రమేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల విద్యా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలు, ఉపాధ్యాయుల బోధన తీరు, హాజరు, మధ్యాహ్న భోజన నిర్వహణ, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి ఆరోగ్యం, పోషకాహారం, భద్రతపై కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందికి స్పష్టం చేశారు.ముందుగా అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన డీఈఓ తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. పాఠ్యాంశాలపై వారి అవగాహన, చదివే సామర్థ్యం, రాత నైపుణ్యం, ప్రశ్నలకు సమాధానాలు చెప్పే విధానాన్ని పరిశీలించి విద్యా ప్రమాణాలను అంచనా వేశారు. ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని గుర్తించి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులలో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించేలా బోధన కొనసాగించాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై కూడా డీఈఓ ప్రత్యేకంగా ఆరా తీశారు. రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, విద్యార్థులకు పోషకాహారం అందించడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆరోగ్యంగా ఉన్న విద్యార్థులే విద్యలో మెరుగైన ఫలితాలు సాధిస్తారని తెలిపారు. యూఆర్ఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో ఎక్కువ మంది అనాథలు, వలస కార్మికుల పిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వారేనని గుర్తు చేస్తూ, అలాంటి విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు తల్లిదండ్రుల మాదిరిగా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. వారి చదువుతో పాటు ఆరోగ్యం, మానసిక స్థైర్యం, వ్యక్తిగత శ్రేయస్సుపైనా నిరంతరం శ్రద్ధ వహించాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన డీఈఓ విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు నమోదును పరిశీలించారు. విద్యార్థుల అభ్యాస ప్రమాణాలను పరీక్షించి బోధన నాణ్యతను మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన సూచనలు చేశారు. తరగతులు సమయానికి నిర్వహించడం, ప్రతి విద్యార్థికి వ్యక్తిగత శ్రద్ధతో బోధన అందించడం ద్వారా విద్యా ఫలితాలను మెరుగుపర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా డీఈఓ పరిశీలించారు. భోజనం నాణ్యత, వంటశాల పరిశుభ్రత, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా, విద్యార్థులకు సరిపడా పోషకాహారం అందుతున్నదా అనే అంశాలను పరిశీలించి సంబంధిత సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. నాణ్యమైన విద్య,ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత వంటి అంశాలపై సమాన దృష్టి సారిస్తేనే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలరని ఆయన అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని డిఇఓ రమేష్ కుమార్ సూచించారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల పండుగ






**గంగా జమున తహజీబ్ సంస్కృతిని కొనసాగించాలి**
**డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్**
**43 ఆలయాలలో బోనాల పండుగ నిర్వహణకు రూ. 17.43 లక్షల ఆర్థిక సహాయం, చెక్కుల పంపిణీ**

హైదరాబాద్ : బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని బోనాల పండుగను ప్రశాంతంగా, ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు.మహేశ్వరం నియోజకవర్గంలోని 43 ఆలయాలలో బోనాల పండుగ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం కింద రూ. 17.43 లక్షల చెక్కులను జిల్లెలగూడ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీమతి పీ. సబితా ఇంద్రారెడ్డి తో కలిసి చిన్నారెడ్డి శనివారం ఆలయ కమిటీలకు అందజేశారు.ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ గ్రామ దేవతల దీవెనల కోసం ప్రతి ఏటా బోనాల పండుగను ఘనంగా నిర్వహించడం తెలంగాణలో తరతరాలుగా ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. బోనం అంటే భోజనం అని అన్ని రకాల ఆహార పదార్థాల వంటకాలతో గ్రామ దేవతలకు బోనం సమర్పించడం తెలంగాణలో ప్రత్యేకమని చిన్నారెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో గంగ, జమున ,తహజీబ్ సంస్కృతిని కొనగ కొనసాగించాలని అన్ని మతాలు అన్ని వర్గాలు కలిసిమెలిసి ఐక్యమత్యంతో ముందుకు సాగి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం కృషి చేయాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, మాజీ మేయర్ పారిజాతా రెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ నిత్యానందరావు, స్థానిక నాయకులు కొండారెడ్డి, చేవెళ్ల జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యస్ఫూర్తికి ఓటు హక్కు వజ్రాయుధం...





పెబ్బేరు ఆగస్టు 01(సమయం ప్రతినిధి) : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం లోని తోమాలపల్లి శాఖాపూరు,రాంపూర్ జనంపల్లిలో గ్రామంలో పర్యటించి" సర్"ప్రక్రియ ను పరిశీలించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. వారు మాట్లాడుతూ పారదర్శక ఓటు... బలోపేత ప్రజాస్వామ్యం అని భాధ్యతగా అర్హులైన ఓటర్లు విధిగా ఓటు నమోదు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. మాలపల్లి,శాఖాపూర్ వై,రాంపూర్,జనంపల్లి, BLA ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓటర్ జాబితా సవరణను ఉద్యమస్ఫూర్తితో పాల్గొని ప్రజాస్వామ్య పాలనకు నాంది పలకాలని తోమాలపల్లి శాఖాపూరు,రాంపూర్ జనంపల్లి లో పర్యటించి విజ్ఞప్తి చేశారు. సర్ ప్రక్రియకు గడువు ముగుస్తున్నందున బి.ఎల్. ఓలు,బి.ఆర్.ఎస్ బి.ఎల్. ఏలు మరియు బి.ఆర్.ఎస్ శ్రేణులు చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి ఓటర్ తుది జాబితాలో ఉండేవిధంగా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పట్టణ బిఆర్ఎస్ నాయకులు మండల అధ్యక్షులు వనం రాములు కర్రస్వామి ఎద్దుల సాయినాథ్ గోవిందు పాతపల్లి రాజశేఖర్, మధు, వీరస్వామి, గోనెల గణేష్ మూర్తి,సాయిచారి, వసంత్ గౌడ్, వై,మర్యాద రవీందర్ రెడ్డి,నాగిరెడ్డి,కోట్ల బాల్ చంద్రా రెడ్డి,మన్నెం నాయుడు,సందీప్ రెడ్డి,మోహన్ రెడ్డి,శంకర్ రెడ్డి,గోవిందు,మహాదేవుడు,జలివాల రాజు, జలివాల విష్ణు,గువ్వల వెంకటేష్,పరమేష్, రాంపూర్ నాయకులు బస్వారాజు, శివరాజు, హర్షవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మొగిలి గోకరయ్య, రాజు, మల్లికార్జున్ ,కొండల్, మన్యం, మల్లేష్, రాజ వర్ధన్ రెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15 నుంచి కొత్త పెన్షన్లు

వరంగల్ : తెలంగాణ రాష్ట్రంలో కొత్త పింఛన్ల పంపిణీని ఆగస్టు 15 నుంచి ప్రారంభించాలనే నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్నారు. ఈ పింఛన్లు ముఖ్యంగా తలసేమియా, సికిల్ సెల్ ఎనిమియా బాధితుల కోసం ప్రత్యేకంగా అందించబడనున్నాయి. ఈ విషయాన్ని పంచాయతీ రాజ్ శాఖపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వెల్లడించారు. ముఖ్యమంత్రి, బాధిత కుటుంబాలకు ఉపశమనం కలిగించేందుకు ఈ పింఛన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అర్హులైన బాధితులను గుర్తించి, వెంటనే పింఛన్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వితంతు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులందరికీ కూడా పింఛన్లు మంజూరు చేయాలని సీఎం సూచించారు. దివ్యాంగులు చనిపోయినప్పుడు వారి భార్యలకు ఆలస్యం లేకుండా వెంటనే పింఛన్లు అందించాలనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.మండల స్థాయిలో అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు ఎంపీడీవోలు బాధ్యత వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. మండల పరిషత్తు సమావేశాలను 45 రోజులకు ఒకసారి నిర్వహించాలని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని తెలిపారు. ఈ సమావేశాలు గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు సహాయపడతాయని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. పంచాయతీ కార్యాలయాలు గ్రామ జనాభా ఆధారంగా వర్గీకరించి నిర్మించాలనే ఆదేశాలు కూడా ఇచ్చారు. పారిశుద్ధ్య పనులు, ఇతర అంశాలకు సంబంధించి కార్యదర్శులు పూర్తి స్థాయిలో బాధ్యత వహించాలని సీఎం తెలిపారు.ఇందిరమ్మ చీరల పంపిణీకి సంబంధించి నాణ్యత విషయంలో రాజీపడొద్దని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో తాగు నీటి సరఫరాలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామీణ తాగు నీటి సరఫరా, హైదరాబాదు వాటర్ బోర్డ్, ఇరిగేషన్ అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించాలి. తాగు నీటికి ప్రాధమికత ఇవ్వాలని ఆయన తెలిపారు. గ్రామీణ తాగు నీటి పథకాల పరిధిలో పనిచేసే వారికి వేతనాలు కచ్చితంగా ఐదో తేదీలోపు అందించాలనే ఆదేశాలు ఇచ్చారు. కోటి మంది మహిళలకు పంపిణీ చేయాల్సిన ఇందిరమ్మ చీరలు ఆకట్టుకునే డిజైన్‌లో ఉండాలని, నాణ్యత విషయంలో ఎటువంటి రాజీపడొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## హైవేలపై అక్రమ పార్కింగ్‌కు కఠిన చర్యలు




మహబూబాబాద్, ఆగస్టు 1, సమయం ప్రతినిధి : మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే జాతీయ రహదారులపై అక్రమ పార్కింగ్‌ను అరికట్టేందుకు రవాణా శాఖ కఠిన చర్యలు చేపట్టిందని జిల్లా రవాణా అధికారి బీ. శంకర్ నాయక్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు శనివారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా గుండా రెండు జాతీయ రహదారులు వెళ్లుతున్న నేపథ్యంలో రహదారుల వెంట ఉన్న దాబాలు, హోటళ్లు, విశ్రాంతి కేంద్రాల వద్ద లారీలు, బస్సులు, ట్రాక్టర్లు తదితర భారీ వాహనాలను ఇష్టానుసారంగా పార్క్ చేయడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని, ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారి పక్కన నిలిపిన వాహనాలకు రెడ్ రిఫ్లెక్టర్లు, రిఫ్లెక్టివ్ టేపులు, పార్కింగ్ లైట్లు, హెచ్చరిక త్రిభుజాలు లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం అధికంగా ఉంటుందన్నారు. మోటారు వాహనాల చట్టం-1988లోని సెక్షన్ 122 ప్రకారం జాతీయ రహదారులపై ఇతరులకు ప్రమాదం కలిగే విధంగా వాహనాలను నిలిపివేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. అక్రమ పార్కింగ్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోల ఆధారంగా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, నో-పార్కింగ్ జోన్లలో వాహనాలు నిలిపిన వారిపైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రవాణా శాఖ సూచనల ప్రకారం అత్యవసర పరిస్థితులు మినహా జాతీయ రహదారులపై వాహనాలను నిలిపివేయరాదని తెలిపారు. తప్పనిసరిగా ఆపాల్సి వస్తే రహదారికి సురక్షిత దూరంలోనే వాహనాన్ని నిలిపివేయాలని, వాహనాల వెనుక భాగంలో రెడ్ రిఫ్లెక్టర్లు, రిఫ్లెక్టివ్ టేప్, పార్కింగ్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి వేళల్లో వార్నింగ్ ట్రయాంగిల్ వినియోగించాలని తెలిపారు. అలాగే వాహనాల ఫిట్‌నెస్, బ్రేకులు, టైర్లు, లైట్లు సక్రమంగా ఉన్నాయో లేదో తరచూ తనిఖీ చేసుకోవాలని, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్య డ్రైవింగ్‌ను పూర్తిగా నివారించాలన్నారు. మహబూబాబాద్ జిల్లా గుండా వెళ్లే జాతీయ రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరి భద్రతే మా ప్రధాన లక్ష్యం. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## గట్టు అంగన్వాడీ కేంద్రంలో
## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు ICDS ప్రాజెక్టు - మల్దకల్



సమయం ప్రతినిధి : జోగు లాంబ గద్వాల జిల్లా గద్వాల జిల్లా, గట్టు మండలం, గట్టు గ్రామంలోని 6వ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్స వాలు మరియు VHND-1 కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా తల్లి పాల ప్రాముఖ్యత, గర్భిణీలు మరియు బాలింతలు తీసుకోవా ల్సిన పోషకాహారం, శిశు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. అలాగే, దాత కె. నర్సింహులు చిన్నారుల కోసం 2 చాపలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పార్వతి గారు, SHG సభ్యుడు జి. సురేష్, స్వయం సహాయక సంఘ సభ్యులు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులు, AWT, AWH తదితరులు పాల్గొన్నారు.

## మండల నూతన కమిటీ ఎన్నిక



మహబూబాబాద్, ఆగస్టు 1, సమయం ప్రతినిధి : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-143) చిన్నగూడూరు మండల నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గాడిపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మాచర్ల ఉపేందర్ ఎన్నికయ్యారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా గాడిపల్లి సతీష్, ఆమృత్ చందులాల్, కోశాధికారిగా బానోతు శ్రీను, సహాయ కార్యదర్శిగా శ్రీరామ్ సాంబయ్య ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా భూపతి కాశయ్య, చిత్తారి సోమన్నలను ఎంపిక చేయగా, గౌరవ అధ్యక్షులుగా అనంతగిరి నాగన్న, గంధసిరి శ్రీపాల్‌లను నియమించిన్నట్లు జిల్లా కన్వీనర్ గుట్టయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ఈరగాని భిక్షం నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు నూతన కమిటీ సభ్యులను అభినందిస్తూ, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు సంఘ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ గాడిపల్లి శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు జంపాల చక్రధర్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.






# బీజేవైఎం నిరసనలో ఉద్రిక్తత.. లాఠీచార్జ్, అరెస్టులు

**మహబూబ్‌నగర్, ఆగస్టు 1 (సమయం ప్రతినిధి):** విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శనివారం బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తెలంగాణ చౌరస్తాలో నిర్వహించిన నిరసనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించిన సమయంలో విద్యార్థులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం పరిస్థితి ఉద్రిక్తంగా మారగా, పోలీసులు లాఠీచార్జ్ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు, బీజేవైఎం నాయకులు గాయపడినట్లు సమాచారం. ఆందోళన సందర్భంగా కొంతమంది విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ, బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. లాఠీచార్జ్‌కు బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

**విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండించిన భండారి శాంతికుమార్**

విద్యార్థులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మహబూబ్‌నగర్‌లో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన సందర్భంగా విద్యార్థులు, యువమోర్చా నాయకులు, కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు భండారి శాంతికుమార్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం, నిరసన తెలపడం ప్రతి ఒక్కరి హక్కు అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు, యువత తమ సమస్యలు, హక్కుల కోసం గొంతెత్తితే ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందిపోయి పోలీసు బలాన్ని ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టకుండా ప్రశ్నించే వారిని అణచివేసే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమని అన్నారు. లాఠీ దెబ్బలతో యువత గొంతును అణచివేయలేరని, ఇటువంటి చర్యలు వారి పోరాట స్ఫూర్తిని మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. లాఠీచార్జ్ ఘటనపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులపై చేసిన వ్యాఖ్యల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల హక్కుల పరిరక్షణలో బీజేపీ వెనక్కి తగ్గబోదని, ప్రజాస్వామ్యబద్ధంగా తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని భండారి శాంతికుమార్ స్పష్టం చేశారు.












## ఖాళీగా ఉన్న టీజీ వైద్య విధాన పరిషత్ కమిషనర్ పదవికి పూర్తిస్థాయి అధికారిని నియమించాలి




ఆత్మకూరు : పదవి విరమణతో రెండు నెలలుగా ఖాళీగా ఉన్న తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ ను తక్షణమే నియమించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆత్మకూర్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట టీవీవీపి కమిషనర్ ను నియమించాలని, పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్వైజర్ కార్మికుల మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నిరసన చేపట్టారు. సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ గా ఉన్న డాక్టర్ అజయ్ కుమార్ పదవి విరమణ చేసి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ కమిషనర్ పదవికి పూర్తిస్థాయి అధికారిని నియమించకపోవడం చేత ఉద్యోగుల సిబ్బంది సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నడుస్తున్న ఏజెన్సీల మూడు సంవత్సరాల కాల వ్యవధి ముగిసి ఏడాది గడిచిపోతున్న కొత్త టెండర్ల ప్రక్రియ నేటికీ ప్రారంభించ లేదని పాత ఏజెన్సీలకే అనుమతులు పెంచడం చేత కార్మికులు తీవ్రమైన ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వము ఒకపక్క ప్రభుత్వ ఉద్యోగులుగా మాదిరిగా కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ సిబ్బందికి కూడా ఒకటవ తేదీన వేతనాలు చెల్లిస్తామని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన క్షేత్రస్థాయిలో మాత్రం పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఏజెన్సీల నిర్వహకులను అడుగుతే మా ఏజెన్సీల సమయం అయిపోయిందని దాటవేస్తూ కార్మికులను తీవ్రమైన వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. కార్మికులకు కనీస వేతనం 26,000 పెంచే విధంగా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని లేనిచో ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు పార్వతమ్మ చెన్నమ్మ, బాలకిష్టమ్మ, ఎండి.మైనుద్దీన్, సత్తార్ శ్రీకాంత్,బాలరాజ్,శైలజ, బాలకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## లంకా ప్రీమియర్ లీగ్‌లోని కొలంబో KAPS జట్టుకు మెంటర్‌గా ఎంపికైన మారుమూల గ్రామ యువకుడు జగదీష్ రెడ్డికి అంతర్జాతీయ గుర్తింపు

పెబ్బేర్ ఆగస్టు 01(సమయం ప్రతినిధి) : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం పరిధిలోని కంచిరావుపల్లి గ్రామ నివాసి ప్రముఖ క్రికెట్ కోచ్ జగదీష్ రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. శ్రీలంకలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక లంకా ప్రీమియర్ లీగ్ (ఎల్పీఎల్)లో పాల్గొంటున్న కొలంబో ఖాప్స్ ఫ్రాంచైజీ జట్టుకు వీవత్‌శీగా ఆయన నియమితులయ్యారు. క్రికెట్ కోచ్‌గా ఎన్నో సంవత్సరాల అనుభవం కలిగిన జగదీష్ రెడ్డి, దేశీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో పలువురు క్రికెటర్లను తీర్చిదిద్దారు. ఆయన సేవలను గుర్తించిన కొలంబో ఖాప్స్ యాజమాన్యం తమ జట్టుకు మెంటర్‌గా ఆహ్వానించింది. ఇటీవల కొలంబో ఖాప్స్ తమ అధికారిక సోషల్ మీడియా వేదికల ద్వారా ఆయన జట్టులో భాగమైన విషయాన్ని ప్రకటించింది. ఈ నియామకం వ్యక్తిగత విజయమే కాకుండా, తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా మా గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. గ్రామీణ ప్రాంతం నుంచి అంతర్జాతీయ ఫ్రాంచైజీ క్రికెట్ వరకు చేరుకున్న జగదీష్ రెడ్డి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, క్రీడాభిమానులు, శిష్యులు మరియు స్నేహితులు జగదీష్ రెడ్డికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## 12వ విడత ఆపరేషన్ ముస్కాన్ ద్వారా వనపర్తి జిల్లాలో 82 మంది బాల కార్మికులకు విముక్తి : ఎస్పీ

**బాలలను కార్మికులుగా పనిలో పెట్టుకున్న 26 మంది యజమానులపై కేసులు నమోదు**

**బాలలను వెట్టిచాకిరికి గురిచేస్తే చర్యలు తప్పవు.**

**బాలల రక్షణకోసం నిరంతర తనిఖీలు నిర్వహిస్తాం.**

**ఆపరేషన్ ముస్కాన్-XII విజయవంతానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించిన ఎస్పీ**

వనపర్తి ఆగస్టు - 01: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని, జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ పేర్లతో విస్తృత తనిఖీలు చేపట్టి బాల కార్మికులను గుర్తించి, రక్షించడం జరుగుతుందని జిల్లాలో 12వ విడత ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా పూర్తయిందని వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... 12వ విడత ఆపరేషన్ ముస్కాన్ లో భాగంగా జూలై 1 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో 82 మంది బాల కార్మికులను రక్షించడం జరిగిందని, వీరిలో 78 మంది బాలురు, 04 మంది బాలికలు ఉన్నారు. బాలలను చట్టవిరుద్ధంగా పనిలో పెట్టుకున్న 26 మంది యజమానులపై కేసులు నమోదు చేసి, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకున్నామని. రక్షించిన బాలలను సంబంధిత శాఖల సమన్వయంతో పునరావాసం కల్పించి, విద్యాభ్యాసం విముక్తి చేసిన బాలలకు, వారి తల్లిదండ్రులకు బాలల హక్కులు, నిర్బంధ విద్య, బాల కార్మిక వ్యవస్థ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించి, తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. బాలల హక్కులను పరిరక్షించడం, వారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. 12 వ విడత ఆపరేషన్ ముస్కాన్ ను విజయవంతం చేయడంలో పోలీసుశాఖ, కార్మికశాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, విద్యాశాఖ, మెడికల్ డిపార్ట్మెంట్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో అద్భుతంగా పనిచేశారని ఎస్పీ గారు అన్నారు. 18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలను పనిలో పెట్టుకోవడం, వెట్టిచాకిరి చేయించడం, బలవంతంగా భిక్షాటన చేయించడం, పశువుల కాపరులుగా, కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫారాలు, పరిశ్రమలు లేదా ఇతర పనులు చేయడం చట్టరీత్యా నేరమని అదనపు ఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపించినా లేదా బాలలపై వేధింపులు, దోపిడీ జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ - 1098 లేదా డయల్-100కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

సమయం
ఆదివారం 02 ఆగస్టు 2026

# పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిపై తెలంగాణ ప్రజాప్రతినిధుల సంతాపం

## అమెరికా లోని మేరీల్యాండ్ రాష్ట్రం లో పార్టీలకు అతీతంగా ఘన నివాళులు.. తెలంగాణ ఉద్యమంలో నిస్వార్థ యోధుడిని కోల్పోయామని ఆవేదన

**మహబూబ్‌నగర్ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం నిస్వార్థంగా పోరాడిన ఉద్యమకారుడు, ప్రజా నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిపట్ల అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రజాప్రతినిధులు, ప్రవాస భారతీయులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా ఒకే వేదికపై చేరిన ప్రజాప్రతినిధులు సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) 19వ మహాసభల్లో పాల్గొనేందుకు అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం బాల్టిమోర్ నగరానికి విచ్చేసిన తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా ఒకే వేదికపై ఏకమై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన నాయకులు, తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ చరిత్రలో పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ఎన్నో త్యాగాలు చేసి, ఉద్యమానికి అంకితభావంతో పనిచేసిన నిబద్ధత కలిగిన నాయకుడిగా ఆయనను గుర్తు చేసుకున్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, "తెలంగాణ ఉద్యమంలో నాతో కలిసి ఎన్నో పోరాటాలు చేసిన ఆత్మీయ సహచరుడిని కోల్పోవడం ఎంతో బాధాకరం. ఉద్యమం కోసం వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన అరుదైన వ్యక్తిత్వం సుదర్శన్ రెడ్డిది. ఆయన లేని లోటు తెలంగాణ సమాజానికి ఎప్పటికీ తీరనిది" అని భావోద్వేగంతో పేర్కొన్నారు. మాజీ మంత్రి లక్ష్మా రెడ్డి



మాట్లాడుతూ, "తెలంగాణ ఉద్యమానికి పెద్ది సుదర్శన్ రెడ్డి అందించిన సేవలు మరువలేనివి. ఉద్యమ కాలంలో ఆయన చూపిన నిబద్ధత, ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తాయి. తెలంగాణ కోసం పోరాడిన యోధుల చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది" అని అన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు శాసనసభలో సుదర్శన్ రెడ్డి ప్రవర్తనను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఒకే ఒక్క సభ్యుడిగా ఉన్నప్పటికీ హుందాతనం, విషయ పరిజ్ఞానం, ప్రజా సమస్యలపై ఆయన ప్రదర్శించిన చిత్తశుద్ధి అందరికీ ఆదర్శంగా నిలిచిందన్నారు. అధికార, ప్రతిపక్షాల మధ్య పరస్పర గౌరవాన్ని కాపాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇచ్చిన నాయకుడిగా ఆయనను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ శాసనసభ సభ్యులు రాజేందర్ రెడ్డి, అల్లా వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, సుదర్శన్ రెడ్డి మరణం తెలంగాణ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాజకీయాలను చూసిన నాయకులు చాలా అరుదని, అలాంటి అరుదైన నాయకత్వం కలిగిన వ్యక్తిని తెలంగాణ కోల్పోయిందని అన్నారు. ఆయన ఆశయాలను భావితరాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. శాసన మండలి సభ్యుడు కర్ణే ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ప్రతి దశలోనూ సుదర్శన్ రెడ్డి కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఉద్యమకారులకు ఆయన అందించిన మార్గదర్శకత్వం ఎప్పటికీ మరువలేనిదని, తెలంగాణ కోసం ఆయన చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. ప్రముఖ జానపద గాయకుడు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ఉద్యమం కోసం ఆయన చేసిన త్యాగాలు, ప్రజలతో మమేకమైన తీరు ప్రతి తెలంగాణవారికి స్ఫూర్తినిస్తాయని అన్నారు. తెలంగాణ పాటల్లో, ఉద్యమ చరిత్రలో ఆయన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని తెలిపారు. ప్రవాస భారతీయ ప్రముఖులు మహేష్, గుండా అమర్‌నాథ్, భాను ఇల్లెందుల తదితరులు మాట్లాడుతూ, స్వదేశానికి దూరంగా ఉన్నప్పటికీ తెలంగాణ ఉద్యమ నాయకులను గుర్తు చేసుకోవడం తమ బాధ్యత అని అన్నారు. సుదర్శన్ రెడ్డి వంటి ఉద్యమ యోధుల త్యాగాల వల్లే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, అలాంటి మహనీయులను భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంతాప సభలో పాల్గొన్న వారంతా సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. అమెరికాలోని తెలుగు సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ప్రవాస భారతీయులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ నివాళులు అర్పించారు.

**సభ ముగింపులో వక్తలు :** మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను, ఉద్యమకారుల సేవలను ఎప్పటికీ మరువబోమని స్పష్టం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితం నిజాయితీ, నిబద్ధత, ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిందని, ఆయన ఆశయాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన పేరు చిరస్మరణీయంగా నిలిచి, రాష్ట్ర ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకుంటుందని సభలో పాల్గొన్న నేతలు ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు.

## చిన్నారులకు విద్య, భద్రత కల్పించాలి : జిల్లా ఎస్పీ డా. శబరీష్

మహబూబాబాద్, ఆగస్టు 1, సమయం ప్రతినిధి : ప్రతి చిన్నారికి విద్య, భద్రత, ఆరోగ్యకరమైన బాల్యం రాజ్యాంగం కల్పించిన హక్కులని జిల్లా ఎస్పీ డా. శబరీష్ తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-XII విజయ వంతంగా ముగిసిందన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు తప్పిపోయిన, అనాథ, నిరాశ్రయులు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను గుర్తించి రక్షించేందుకు ప్రత్యేక బృందాలు జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ఈ ఆపరేషన్‌లో మొత్తం 40 మంది చిన్నారులను గుర్తించి రక్షించారు. వీరిలో 24 మంది బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై 20 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. మిగిలిన 16 మంది చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీస్ స్టేషన్‌ల వారీగా మహబూబాబాద్ సబ్‌డివిజన్ పరిధిలో 23 మంది చిన్నారులను రక్షించి, 10 మందికి కౌన్సెలింగ్



నిర్వహించగా 12 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. తొర్రూర్ సబ్‌డివిజన్‌లో 17 మంది చిన్నారులను రక్షించి, ఆరుగురికి కౌన్సెలింగ్ నిర్వహించి ఎనిమిది ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని తెలిపారు. బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆపరేషన్ విజయవంతానికి సహకరించిన జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ (సీడబ్ల్యూసీ, డీసీపీయూ), చైల్డ్ హెల్ప్‌లైన్-1098, కార్మిక శాఖ అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను అభినందించారు. బాలకార్మికులు, అనాథలు లేదా ప్రమాదంలో ఉన్న చిన్నారులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే డయల్-100, 112 లేదా చైల్డ్ హెల్ప్‌లైన్-1098కు సమాచారం అందించి వారి భవిష్యత్తును కాపాడడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

## నీటి సంరక్షణలో ప్రతి ఒకరు భాగస్వాములు కావాలి : కమిషనర్ గిరీష్

(జడ్చర్ల ఆగస్టు 1, సమయం ప్రతినిధి) : జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "క్యాచ్ ది రైన్" అవగాహన కార్యక్రమంలో భాగంగా నాగసాల చెరువులో డీసిల్టేషన్ (పూడిక తొలగింపు) పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్,శాసనసభ్యుల మాతృమూర్తి శశికళ, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భూగర్భ జలాల మట్టాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం వల్ల భవిష్యత్ తరాలకు తాగునీటి సమస్యలు తగ్గే అవకాశముందని ప్రతి ఒకరు వర్షపు నీటి సంరక్షణలో భాగస్వామి కావాలని, చెరువులు, కుంటలు, కాలువలను పరిరక్షించడం ద్వారా నీటి వనరులను కాపాడుకోవచ్చని



పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మమ్మ, అరవింద, సుగుణమ్మ, బాలు, భరత్, నాగసాల గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ మార్కెట్ (సంత) సముదాయం షాప్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే గారు

సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా ఈరోజు గద్వాల నియోజకవర్గంలోని మల్దకల్ మండలం కేంద్రంలో నాబార్డ్ వారి చే 20 లక్షల వ్యయం తో నిర్మాణమైన గ్రామీణ మార్కెట్ (సంత) సముదాయం షాప్ ను ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు, జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు గారు హాజరయ్యారు. గ్రామీణ మార్కెట్ (సంత) సముదాయపు షాప్ లను ఎమ్మెల్యే గారు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు జిల్లా సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి విస్తరణ లేనట్టే...

హైదరాబాద్ : హైదరాబాద్ నుంచి ఢిల్లీ దాకా తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యనేతలు సాగించిన మూడు రోజుల సుదీర్ఘ చర్చలు, ఏఐసీసీ సమన్వయ కమిటీ భేటీల తర్వాత తేలిందేమిటంటే.. ఎంతోమంది సీనియర్లు, ఎమ్మెల్యేలు ఆశగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణ ప్రస్తుతానికి కోల్డ్ స్టోరేజీ లోకి వెళ్లిపోయింది. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా సీనియర్లంతా ఢిల్లీ వేదికగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే, రాహుల్ గాంధీలతో పలు విడతలుగా సమావేశమైనప్పటికీ, కేబినెట్ విస్తరణ లేదా మార్పుచేర్పులకు మాత్రం అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. దీంతో చాన్నాళ్లుగా మంత్రి పదవులపై ఆశలు పెంచుకున్న ఆశావహులకు నిరాశే మిగిలింది.ఈ నిర్ణయం వెనుక అధిష్ఠానం ఊరుకున్నంత ఉత్తమం.. బోడిగుండంత సుఖం అనే రక్షణాత్మక వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం తెలంగాణ మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న బెర్తుల భర్తీ లేదా రీషఫుల్ చేపడితే.. పార్టీలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు రేగుతాయనే భయం అధిష్ఠానంలో ఉంది. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్‌లోనూ, పార్టీ అంతర్గత రాజకీయంలోనూ చోటుచేసుకున్న పరిణామాలు, అసంతృప్తుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. తెలంగాణలో ఉన్న శాంతిభద్రతలను, ప్రభుత్వ స్థిరత్వాన్ని దెబ్బతీసే సాహసం ఇప్పుడు చేయకూడదని హైకమాండ్ ఒక స్పష్టమైన ముగింపునకు వచ్చినట్లు తెలుస్తోంది.మరోవైపు, కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవుల పోటీ ఊహించని మలుపులు తిరుగుతోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వంటి సీనియర్లు ఒకవైపు గట్టిగా ఒత్తిడి తెస్తుండగా.. జెన్-జీ నినాదంతో యువ ఎమ్మెల్యేలకు సైతం ప్రాతినిధ్యం కల్పించాలనే చర్చ సరికొత్త సమీకరణాలను తెచ్చిపెట్టింది. సీఎం రేవంత్ రెడ్డి సైతం యువ ముఖాలకు అవకాశం ఇవ్వాలనే ఆలోచనను తెరపైకి తెచ్చినట్లు వార్తలు రావడం, స్థానిక సంస్థల సమయానికి ఓటు బ్యాంకును ఆకట్టుకోవాలనే వ్యూహాలు రేసును మరింత సంక్లిష్టంగా మార్చాయి. సీనియర్ వర్సెస్ జూనియర్, రెడ్డి వర్సెస్ బీసీ, ఎస్సీ సామాజిక సమీకరణాల మధ్య సమతుల్యత సాధించడం దాదాపు అసాధ్యంగా మారడంతోనే విస్తరణ నిర్ణయాన్ని వాయిదా వేశారు.ఢిల్లీ వేదికగా ఏఐసీసీ పెద్దలు తెలంగాణ నేతలకు చాలా స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పాలిటిక్స్ పక్కనపెట్టి, పాలనపై దృష్టి సారించాలని, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి వేగంగా తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి 45 రోజులకు ఒకసారి పీసీసీ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి.. ప్రభుత్వం, పార్టీ యంత్రాంగం మధ్య సయోధ్యను పెంచాలని ఆదేశించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి పెట్టాలని, మంత్రి పదవుల కోసం ఢిల్లీ చుట్టూ తిరగడం కన్నా నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆశావహులకు నర్మగర్భ హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. హైకమాండ్ వ్యూహాన్ని గమనిస్తే.. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన వేళ, ఈ రకమైన అంతర్గత కుమ్ములాటలు, ముఠా తగాదాలు బయటపడితే అది కాంగ్రెస్ ఇమేజ్‌ను ప్రజల్లో దెబ్బతీస్తుందనే ఆందోళన వారిలో స్పష్టంగా కనిపిస్తోంది.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085